నవతెలంగాణ
ఆదిలాబాద్
ఆదివారం | డిసెంబర్ 10, 2023 | www.navatelangana.com

ఉచిత కంటి శిబిరానికి స్పందన

నవతెలంగాణ - కాగజ్‌నగర్

శ్రీకొత్తపల్లి వెంకటలక్ష్మి- చంద్రయ్య మెమోరియల్ సర్వీస్ సొసైటీ ఆధర్వంలో శనివారం కిమ్స్ మల్టీ స్పెషాలిటీ హాస్పిటల్‌లో నిర్వహించిన ఉచిత కంటి శిబిరానికి స్పందన లభించింది. డాక్టర్ కొత్తపల్లి శ్రీనివాస్, అనిత దంపతులు నిర్వహించే ఉచిత కంటి పరీక్షల్లో భాగంగా 17 మందికి ఆపరేషన్ నిమిత్తం భోజన సదుపాయం, ప్రయాణ చార్జీలు సమకూర్చి బెల్లంపల్లి లయన్స్ కంటి ఆస్పత్రికి తరలించారు. ఈ కార్యక్రమంలో కిమ్స్ హాస్పిటల్ సిబ్బంది పాల్గొన్నారు.



మొదటిసారి అసెంబ్లీలో అడుగుపెట్టిన వివేక్ వెంకటస్వామి

నవతెలంగాణ-జైపూర్

కాంగ్రెస్ పార్టీ చెన్నూర్ ఎమ్మెల్యే గడ్డం వివేక్ వెంకటస్వామి శనివారం మొట్టమొదటిసారి అసెంబ్లీలో అడుగు పెట్టారు. ముందుగా మంత్రులు, ఎమ్మెల్యేలతో కలిసి అమరవీరుల స్థూపం వద్ద జోహర్లు అర్పించారు. అదేవిధంగా తన తండ్రి పెద్దపల్లి మాజీ ఎంపీ, కాంగ్రెస్ సీనియర్ నాయకుడు గడ్డం వెంకటస్వామి విగ్రహానికి పూలమాల వేసి నివాళ్లు అర్పించారు. అనంతరం అసెంబ్లీలో అడుగు పెట్టారు. శాసన సభ్యునిగా ప్రమాణం చేశారు.



బీసీలకు ఇచ్చిన హామీలను కొత్త ప్రభుత్వం నిలబెట్టుకోవాలి



నవతెలంగాణ-హాజీపూర్

తెలంగాణలో కొలువుదీరిన రేవంత్‌రెడ్డి ప్రభుత్వం బీసీ వర్గాలకు ఇచ్చిన హామీలను నిలబెట్టుకునే దిశలో సత్వరం చర్యలు చేపట్టాలని బీసీ ఐక్య వేదిక నాయకులు డిమాండ్ చేశారు. శనివారం మంచిర్యాలలో జరిగిన బీసీ ఐక్య వేదిక సమన్వయ సమావేశంలో వారు మాట్లాడారు. ప్రజల ఆకాంక్షల మేరకు రాష్ట్రంలో ఏర్పాటైన రేవంత్‌రెడ్డి ప్రభుత్వాన్ని స్వాగతిస్తున్నామని తెలిపారు. తెలంగాణలో బీసీ జనగణన చేపడతామని, జనాభాకు అనుగుణంగా బీసీ రిజర్వేషన్లు పెంచుతామని కాంగ్రెస్ పార్టీ ఎన్నికల్లో హామీ ఇచ్చినందుకే ప్రజల మద్దతు దక్కిందని గుర్తు చేశారు. బీసీ వర్గాల సామాజిక న్యాయం గురించి మాట్లాడకుండా నాయకుల పదవుల గురించి మాట్లాడిన పార్టీలను బీసీ ప్రజలు తిరస్కరించారని తెలిపారు. స్పష్టమైన బీసీ ఎజెండాకే ప్రజలు ఓట్లేశారని వారు తెలిపారు. రాష్ట్రస్థాయిలో సత్వరం జనాభా లెక్కల సేకరించి జనాభాకు తగిన స్థాయిలో సామాజిక న్యాయం అందించడానికి ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని కోరారు. కులాల పేరుతో బీసీలను విభజించడం మానుకొని ప్రతి జిల్లా కేంద్రంలో బీసీ భవన్‌ను ఏర్పాటు చేయాలని డిమాండ్ చేశారు. దేశంలో మెజార్టీ వర్గంగా ఉన్న బీసీ ప్రజలు తమ న్యాయమైన హక్కులను సాధించుకునే దిశలో పూలే మహనీయుడు అందించిన చైతన్యంతో ఉద్యమించాలని వారు పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో బీసీ ఐక్యవేదిక కన్వీనర్ వడ్డేపల్లి మనోహర్, సామాజిక న్యాయవేదిక కన్వీనర్ రంగు రాజేశం, సీనియర్ బీసీ నాయకులు కనుకుంట్ల మల్లయ్య, అఖిల గాండ్ల తెలికుల సంఘం జిల్లా అధ్యక్షులు బుద్ధి చంద్రమౌళి, సింగరేణి ఐక్యవేదిక నాయకులు పెద్దపల్లి కోటిలింగం, మేరు సంఘం నాయకులు మాడిశెట్టి విశ్వం, బీసీ నాయకులు సమ్ము రాజన్న, సోమయ్య, భూమయ్య పాల్గొన్నారు.

మైనింగ్ స్టాఫ్ ఉద్యోగుల సమస్యల పరిష్కారానికి కృషి చేద్దాం



నవతెలంగాణ-జైపూర్

సింగరేణిలోని మైనింగ్ స్టాఫ్ ఉద్యోగుల సమస్యల కోసం కృషి చేద్దామని ఏఐటీయూసీ బెల్లంపల్లి రీజియన్ కార్యదర్శి వంగరి రాజేశ్వర్‌రావు కోరారు. శనివారం ఇందారం భూగర్భ గని, ఉపరితల గని మైనింగ్ స్టాఫ్ ఉద్యోగులతో సమావేశమయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ 10న సీసీసీ నస్పూర్‌లో గల నర్సయ్య భవన్‌లో మైనింగ్ స్టాఫ్ ఉద్యోగుల సమావేశం ఏర్పాటు చేస్తున్నట్లు తెలిపారు. సింగరేణి వ్యాప్తంగా మైనింగ్ స్టాఫ్ ఉద్యోగులు ఎదుర్కొంటున్న సమస్యలపై సమావేశంలో చర్చించనున్నట్లు తెలిపారు. మైనింగ్ స్టాఫ్ ఉద్యోగులకు కోలిండియాలో ఇస్తున్నట్లు చార్జి అలవెన్స్ ఇవ్వడం, ఇక్రిమెంట్లు పోయిన వారికి ఏక కాలంలో తిరిగి ఇవ్వాలని డిమాండ్ చేశారు. భూగర్భ, ఉపరితల గనులలో డిప్యూటేషన్లు రద్దు చేసి సీనియార్టీ ప్రకారం ఇవ్వడం, 2017 రెగ్యులేషన్ ప్రకారం మైనింగ్ సర్దార్‌లను అవకాశం ఉన్నంత వరకు ఉపరితల గనుల్లో తీసుకోవాలని డిమాండ్ చేశారు. ఏ-1 ఓవర్‌మెన్ గ్రేడ్‌లో ఉన్నవారికి జేఎంఓ ఈ-2 ఇవ్వాలని, మైనింగ్ ఉద్యోగులకు చదువుకోవడానికి ఎన్ఓసీ ఇవ్వాలని డిమాండ్ చేశారు. సమావేశానికి ఏఐటీయూసీ అధ్యక్షులు వాసిరెడ్డి సీతారామయ్య, ప్రధాన కార్యదర్శి కొమిడి రాజ్‌కుమార్ ముఖ్య అతిథులుగా హాజరవుతున్నారని తెలిపారు. సమావేశానికి మైనింగ్ స్టాఫ్ ఉద్యోగులు అధిక సంఖ్యలో పాల్గొని విజయవంతం చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో శ్రీరాంపూర్ ఏరియా మైనింగ్ స్టాఫ్ నాయకులు బాలకృష్ణ, శంకరయ్య, సదయ్య పాల్గొన్నారు.

ఘనంగా సోనియా గాంధీ జన్మదిన వేడుకలు



నవతెలంగాణ-లక్సెట్టిపేట

ఏఐసీసీ అగ్ర నాయకురాలు సోనియా గాంధీ పుట్టిన రోజు వేడుకలను పట్టణంలోని విశ్రాంతి భవనం వద్ద కాంగ్రెస్ శ్రేణులు కేక్ కట్ చేసి ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా మున్సిపల్ ఫ్లోర్ లీడర్ చెల్ల నాగభూషణం మాట్లాడుతూ రాజకీయంగా ఎన్ని అవరోధాలు ఎదురైనా తెలంగాణ ఆకాంక్షను సోనియా గాంధీ నెరవేర్చారన్నారు. సోనియా జన్మదినం రోజే గతంలో తెలంగాణ ప్రకటన వచ్చిందని గుర్తు చేశారు. తెలంగాణ కలను సాకారం చేసిన సోనియా ఆయురారోగ్యాలతో వర్ధిల్లాలని ఆకాంక్షించారు. కార్యకర్తల త్యాగం, కష్టంతోనే అధికారంలోకి వచ్చామన్నారు. కార్యక్రమంలో కాంగ్రెస్ జిల్లా ఉపాధ్యక్షులు చింతా అశోక్, అన్నం మంగ చిన్నన్న, పలువురు పట్టణ నాయకులు పాల్గొన్నారు.

ఉచిత బస్సు ప్రయాణాన్ని ప్రారంభించిన ఎంపీపీ

ఉచిత బస్సు ప్రయాణాన్ని ఎంపీపీ అన్నం మంగ చిన్నన్న బస్టాండ్ వద్ద ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ మేనిఫెస్టోలో చెప్పినట్టు ఆరు గ్యారెంటీ హామీలలో భాగంగా మహిళలకు ఉచిత బస్ సౌకర్యాన్ని ప్రభుత్వం వచ్చిన రెండు రోజులకే ప్రారంభించామన్నారు. దీంతో మహిళలు సంతోషం వ్యక్తం చేస్తున్నారని తెలిపారు. కార్యక్రమంలో మహిళా నాయకురాలు రామిల్ల శారద, సునీత పాల్గొన్నారు.

మార్కెట్‌లో మద్దతు కరువాయె..!

- జిల్లాలో రోజురోజుకూ దిగజారిపోతున్న పత్తి ధర
- తేమ సాకుతో కొనుగోళ్లకు నిరాకరిస్తున్న సీసీఐ
- ప్రయివేటులో తక్కువకే విక్రయిస్తున్న కర్షకులు
- అన్నదాతల దుస్థితిని పట్టించుకోని అధికారులు

అందరి దృష్టి ఎన్నికల మీదనే పడింది. సుమారు నెల రోజులకు పైగా అధికారులు, ప్రజల దృష్టి అంతా వాటిపైనే కేంద్రీకృతమైంది. ఇదే అదనుగా వ్యాపారులు పత్తి ధరను అమాంతం దించేశారు. ఇటు తేమ సాకుతో ప్రభుత్వ రంగ సంస్థ సీసీఐ కూడా కొనుగోళ్లకు నిరాకరించడంతో కర్షకులను కష్టాల పాలు చేస్తోంది. మార్కెట్‌లో పత్తికి గిట్టుబాటు కాదు కదా.. కనీసం మద్దతు ధర కూడా లభించని దుస్థితి నెలకొంది. తేమను సాకుగా చూపిస్తున్న సీసీఐ కొనుగోళ్లు చేయకపోవడంతో గత్యంతరం లేక రైతులు ప్రయివేటుకు విక్రయించాల్సి వస్తోందని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. మరోపక్క గత నాలుగు రోజులుగా జిల్లాలో ఏర్పడుతున్న వాతావరణ ప్రభావం సైతం రైతులకు అవరోధంగా మారడం వారి కష్టాలను మరింత రెట్టింపు చేస్తోంది. మార్కెట్‌లో పత్తికి కనీసం మద్ధతు ధర కూడా లభించకపోయినా అధికారవర్గాలు దృష్టి సారించడం లేదనే విమర్శలు వ్యక్తమవుతున్నాయి.



నవతెలంగాణ- ఆదిలాబాద్ ప్రాంతీయ ప్రతినిధి

ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లాలో అధిక మంది రైతులు పత్తి పంట మీదనే ఆధారపడుతుంటారు. ఆదిలాబాద్ జిల్లాలో సుమారు 4.12లక్షల ఎకరల్లో ఈ పంట వేయగా ఉమ్మడి జిల్లా పరిధిలో సుమారు 12లక్షల ఎకరాల్లో పత్తిని పండించారు. ఆసియాలోనే పేరుగాంచిన ఆదిలాబాద్ పత్తి మార్కెట్‌లో రైతులకు నష్టాలు తప్పడం లేదు. పత్తికి ప్రభుత్వం మద్దతు ధరగా రూ.7020గా నిర్ణయించింది. పత్తి మార్కెట్ ప్రారంభమైన సమయంలో మార్కెట్‌లో వ్యాపారులు క్వింటాల్‌కు రూ.7080గా నిర్ణయించారు. ఇంతకంటే అధికంగా ధర పెరుగుతుందని భావించిన రైతుల ఆశలు అడియాశలయ్యాయి. పెరగడం మాట అటుంచితే తగ్గుతూ వచ్చింది. మార్కెట్ ప్రారంభమైన నాటి నుంచి ఇప్పటి వరకు ధర పెరిగిన సందర్భాలు కనిపించ లేదు. దీంతో రైతులకు గిట్టుబాటు ధర పక్కన పెడితే కనీసం ప్రభుత్వం నిర్ణయించిన మద్దతు ధర కూడా లభించని పరిస్థితి నెలకొంది. ఇప్పటి వరకు మార్కెట్‌లో 1,88,101క్వింటాళ్ల పత్తి మాత్రమే విక్రయానికి వచ్చింది. ఎన్నికల సమయంలో ఎవరూ దృష్టిసారించనే కారణంగా వ్యాపారులు ధరను అమాంతం తగ్గించారనే విమర్శలున్నాయి. మరోపక్క అధికారులకు ఈ విషయం తెలిసినా లోపాయికారిగా వ్యాపారులకే మద్దతుగా నిలుస్తున్నారనే విమర్శలు వినిపిస్తున్నాయి.

తేమసాకుతో నిరాకరణ..?

ప్రభుత్వ నిబంధనల ప్రకారం పత్తిలో 8శాతం తేమ ఉంటేనే ప్రభుత్వ రంగ సంస్థ సీసీఐ పూర్తి మద్దతు ధరను వెచ్చించాలని నిర్ణయించింది. 12తేమ శాతం వచ్చినా కిలో చొప్పున కోత విధిస్తూ కొనుగోలు చేయాలని భావించింది. కానీ కొన్ని రోజులుగా వాతావరణం చల్లగా ఉండటం, మంచు ప్రభావం కారణంగా సహజంగానే పత్తిలో అధిక తేమశాతాన్ని చూపిస్తోంది. దీంతో సీసీఐ ప్రస్తుతం పత్తి కొనుగోళ్లకు నిరాకరిస్తున్నట్లు తెలుస్తోంది. ఇప్పటి వరకు ప్రయివేటు వ్యాపారులు 1,67,817క్వింటాళ్ల కొనుగోలు చేయగా, సీసీఐ కేవలం 20,284 క్వింటాళ్ల మాత్రమే కొనుగోలు చేసింది. మద్దతు ధరకు కొనుగోలు చేయాల్సిన సీసీఐ చేతులెత్తేయడంతో గత్యంతరం లేని పరిస్థితిలో క్వింటాల్‌కు కేవలం రూ.6780కు విక్రయించాల్సి వస్తోందని అన్నదాతలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. మరోపక్క మార్కెట్‌లో ఉన్న సీసీఐ సిబ్బంది కొందరు రైతులతో ప్రయివేటుకు విక్రయించాలని చెబుతున్నట్లు ప్రచారం జరుగుతోంది. ఇప్పటికైనా ఉన్నతాధికారులు, ప్రజాప్రతినిధులు దృష్టిసారించి మార్కెట్‌లో రైతులకు గిట్టుబాటు అయ్యేలా ధర పెరిగేలా చూడాలని అన్నదాతలు కోరుతున్నారు.

సీసీఐ కొనుగోలు చేయాలి : బండి దత్తాత్రి, అఖిలపక్ష రైతు సంఘం నాయకుడు

అకాల వర్షం కారణంగా పత్తి పంట నష్టపోయింది. రంగు మారింది..తేమ అధికంగా ఉందనే కారణంగా సీసీఐ కొనుగోలుకు నిరాకరించడం సరికాదు. ప్రకృతి కారణంగా నష్టం జరిగితే ఆదుకోవాల్సింది ప్రభుత్వ రంగ సంస్థనే. ఈ సమయంలోనే మద్దతు ధర వెచ్చించి వడ్ల మాదిరిగానే పత్తిని కూడా కొనుగోలు చేయాలి. వ్యాపారులు సైతం గిట్టుబాటు ధరను పెంచి కొనుగోలు చేయాలి. ఉన్నతాధికారులు దృష్టిసారించి అన్నదాతలకు న్యాయం చేయాలి.



సమస్యలపై పోరాడుతున్న సీఐటీయూను గెలిపించాలి

- ఎస్‌సీఈయూ ఉప ప్రధాన కార్యదర్శి నాగరాజ్ గోపాల్



నవతెలంగాణ-మందమర్రి

కార్మికుల సమస్యలపై పోరాడుతున్న సీఐటీయూను గెలిపించాలని సింగరేణి కాలరీస్ ఎంప్లాయిస్ యూనియన్(సీఐటీయూ) డిప్యూటీ జనరల్ సెక్రటరీ నాగరాజ్ గోపాల్ కోరారు. శనివారం మందమర్రి కెకె ఓసీపీలో పిట్ సెక్రటరీ మేడి రాజమల్లు అధ్యక్షతన ఏర్పాటు చేసిన గేట్ మీటింగ్‌లో నాగరాజ్ గోపాల్ మాట్లాడారు. ఏరియాలో గెలిచామని చెప్పుకునే రెండు సంఘాలు కార్మికుల సమస్యలపై మాట్లాడవని, ప్రతి సమస్యపై పోరాడుతున్న ఎస్‌సీఈయూ సూర్యుని గుర్తుకు ఓటు వేసి గెలిపించాలని కార్మికులను కోరారు. గెలిచిన సంఘాలు కార్మిక సమస్యలపై యాజమాన్యంతో చర్చించకుండా క్వార్టర్ల పైరవీలు, డిప్యూటేషన్ల పైరవీలకు పరిమితమవుతూ ఏరియా సమస్యలు గాలికి వదిలేయడం జరిగిందన్నారు. ఓసి కార్మికులకు రావాల్సిన హెచ్‌ఆర్‌ఏ ఇప్పటి వరకు ఇప్పించలేని సంఘాలు రేపు గెలిస్తే ఏవిధంగా ఇప్పిస్తాయని ప్రశ్నించారు. ప్రభుత్వ అనుబంధంగా ఉండే ఏసంఘమైన తమ అనుబంధ ప్రభుత్వాన్ని ప్రశ్నించకుండా యాజమాన్యానికి అనుకూలంగానే ఉంటుందని, మరిన్ని పైరవీలు పెరుగుతాయని తెలిపారు. ఇప్పటికే అన్ని యూనియన్లు కలిసి అగ్రిమెంట్ చేసిన మారుపేర్ల మైనింగ్ సిబ్బంది ట్రేడ్స్‌మెన్స్, ఈపి ఆపరేటర్లకు సర్ఫేస్‌లో అదే డెసిగ్నేషన్ ఇవ్వాలన్న అగ్రిమెంట్లను అమలు చేయించడంలో గెలిచిన సంఘాలు విఫలమయ్యాయని పేర్కొన్నారు. పోరు యాత్ర ద్వారా సిఐటియు సొంతింటి కల, అలవెన్స్‌పై, ఐటి మాఫీ గురించి చైతన్యం చేయడం వల్లనే నేడు అన్ని సంఘాలు అదే పాట పాడుతున్నాయని తెలిపారు. అందుకే ప్రతి సమస్యపై కార్మికులను, కార్మిక సంఘాలను కదిలిస్తూ చివరకు నివాస ప్రాంతాల్లో తాగునీరు, సీఎంపిఎఫ్ వడ్డీ రేటు, డిఏ ఇప్పించడం వంటి ఆర్థిక ప్రయోజనాలు ఇప్పించగలిగామని తెలిపారు. కార్మిక సమస్యలపై కార్మికులను కార్మిక సంఘాలను కలుపుకొని పోయే సీఐటీయూ లాంటి సంఘాలు గెలిస్తే సమస్యలు పరిష్కారం అవుతాయని తెలిపారు. ఈ కార్యక్రమంలో అసిస్టెంట్ ఫిట్ సెక్రటరీ మహమ్మద్ ఆరిఫ్, బ్రాంచ్ అధ్యక్షులు వెంకటస్వామి, కార్యదర్శి అల్లి రాజేందర్, ఉపాధ్యక్షులు రామగిరి రామస్వామి, వడ్లకొండ ఐలయ్య ఆర్గనైజర్ ప్రవీణ్ పలువురు ఒచీశీఅవగఓసి కార్మికులు పాల్గొన్నారు.

ఇల్లందు క్లబ్‌లో క్రీడలను ప్రారంభించిన సింగరేణి అధికారులు



నవతెలంగాణ-నస్పూర్

బంగ్లా ఏరియాలోని ఇల్లందు క్లబ్‌లో సింగరేణి వ్యాప్తంగా 28 అధికారుల క్లబ్ సభ్యులకు టెన్నికాయిట్, షటిల్ బ్యాడ్మింటన్, టేబుల్ టెన్నిస్ క్రీడలను జనరల్ మేనేజర్(కార్పొరేట్ ప్రాజెక్ట్స్ అండ్ ప్లానింగ్) జక్కం రమేష్, శ్రీరాంపూర్ ఏరియా జీఎం బి.సంజీవరెడ్డి ప్రారంభించి, క్రీడా పతాకాన్ని ఆవిష్కరించారు. ఈ సందర్భంగా జనరల్ మేనేజర్లు మాట్లాడుతూ సింగరేణి వ్యాప్తంగా ఉన్న అధికారుల కుటుంబ సభ్యులు ఈ క్రీడా పోటీలలో పాల్గొనడం చాలా సంతోషకరమన్నారు. క్రీడాకారులందరూ క్రీడల్లో పాల్గొని తమ ప్రతిభాపాటవాలను ప్రదర్శించాలని, ఇటువంటి ఆహ్లాదకరమైన వాతావరణం సింగరేణి సంస్థలో ఉండడం అభినందించదగిన విషయమని తెలిపారు. క్రీడాకారులు గెలుపోవటములను పక్కనపెట్టి క్రీడా స్ఫూర్తిని ప్రదర్శించాలని కోరారు. క్రీడాకారులందరికి టీ షర్ట్‌లను ముఖ్య అతిథుల చేతుల మీదుగా అందజేశారు. కార్యక్రమంలో సేవా అధ్యక్షురాలు రాధాకుమారి-సంజీవరెడ్డి, అధికారుల సంఘం సెంట్రల్ వైస్ ప్రెసిడెంట్ ఏవీరెడ్డి, శ్రీరాంపూర్ ఏరియా అధికారుల సంఘం అధ్యక్షులు అబ్దుల్ ఖాదీర్, క్రీడల కన్వీనర్ డాక్టర్ రమేష్ బాబు, కో - కన్వీనర్ తిరుపతి, అన్ని ఏరియాల అధికారుల కుటుంబ సభ్యులు పాల్గొన్నారు.

అట్టహాసంగా రెండు గ్యారెంటీలు ప్రారంభం

- పథకాలు సద్వినియోగం చేసుకోవాలి : ఆదిలాబాద్ కలెక్టర్ రాహుల్‌రాజ్

నవతెలంగాణ-ఆదిలాబాద్‌టౌన్

ఆర్టీసీ బస్సుల్లో మహిళలకు ఉచిత ప్రయాణానికి మహాలక్ష్మి పథకం, ఆరోగ్యశ్రీ పథకాన్ని రూ.10 లక్షలకు పెంచుతూ రాజీవ్ ఆరోగ్యశ్రీ చేయూత పథకాలు శనివారం నుండి అమలవుతాయని కలెక్టర్ రాహుల్ రాజ్ అన్నారు. శనివారం స్థానిక ప్రభుత్వ సూపర్ స్పెషాలిటీ ఆసుపత్రి ప్రాంగణంలో మహాలక్ష్మి పథకం ద్వారా ఆర్‌టిసి బస్‌లలో మహిళలకు ఉచిత ప్రయాణం, ఆరోగ్యశ్రీ పరిమితిని రూ.10లక్షలకు పెంచే పథకాలను కలెక్టర్ ప్రారంభించారు. ముందుగా రాజీవ్ ఆరోగ్యశ్రీ సాయం 10 లక్షల పోస్టర్‌ను అధికారులతో కలిసి ఆవిష్కరించి అనంతరం మహిళలకు ఉచిత బస్సు ప్రయాణాన్ని రిబ్బన్ కట్ చేసి జెండా ఊపి ప్రారంభించారు.

పేద, మధ్యతరగతి కుటుంబాలకు ఎంతో మేలు

బాలికలు, మహిళలు, ట్రాన్స్ జెండర్లు ఆర్టీసీ పల్లె వెలుగు, ఎక్స్‌ప్రెస్ బస్‌లలో రాష్ట్ర సరిహద్దు వరకు ఎక్కడికైనా ఉచితంగా ప్రయాణం చేయవచ్చని కలెక్టర్ తెలిపారు. మహాలక్ష్మి పథకం ద్వారా మహిళలకు ఉచిత బస్ ప్రయాణం కోసం ఫొటో గుర్తింపు కార్డు ఆధారంగా జీరో చార్జీ టికెట్ అందించడం జరుగుతుందని, ఇది మహిళా సాధికారతకు దోహదపడడంతో పాటు ఆర్టీసి బస్సులో ప్రయాణం వల్ల మహిళలకు రక్షణ ఉంటుందని అన్నారు. ప్రతి మహిళా ఆర్టీసి బస్సులో ప్రయాణించాలని సూచించారు. ఆరోగ్యశ్రీ పథకం రూ.5 లక్షల నుండి రూ.10లక్షలకు పెంచడం ద్వారా పేద, మధ్య తరగతి కుటుంబాలకు ఎంతో మేలు జరుగుతుందని పేర్కొన్నారు. ప్రభుత్వం ప్రవేశపెట్టిన ఆరోగ్యశ్రీ, మహాలక్ష్మి పథకాలను సద్వినియోగం చేసుకోవాలని కోరారు. అనంతరం బస్సులో విద్యార్థులు, మహిళలతో కలిసి ప్రభుత్వ ఆసుపత్రి నుండి మావల చౌరస్తా, తిరిగి కలెక్టర్ చౌక్ నుండి ఆసుపత్రి వరకు కలెక్టర్ ప్రయాణం చేశారు. ప్రయాణ సమయంలో కలెక్టర్‌తో పాటు ప్రయాణిస్తున్న మహిళా ఉద్యోగులు, విద్యార్థులకు జీరో చార్జీ టికెట్‌ను అందించారు. కార్యక్రమంలో రిమ్స్ డైరెక్టర్ రాథోడ్ జైసింగ్, జిల్లా వైద్య ఆరోగ్య శాఖ అధికారి డా. రాథోడ్ నరేందర్, ఆర్‌టిఓ శ్రీనివాస్, డిఈఓ ప్రణీత, డీఎస్పీ ఉమేందర్, ఆర్టీసీ ఆర్‌ఎం సోలెమాన్, డిఎం కల్పన, మున్సిపల్ కమిషనర్ శైలజ, జడ్పిటిసి గోక గణేష్‌రెడ్డి, ఇతర అధికారులు, ప్రజాప్రతినిధులు, వైద్య, ఆర్టీసీ సిబ్బంది, విద్యార్థులు, మహిళలు పాల్గొన్నారు.





ఉచిత బస్సు ప్రయాణం ప్రారంభం

నవతెలంగాణ-జైపూర్

ఎన్నికలకు ముందు కాంగ్రెస్ ప్రకటించిన ఆరు గ్యారంటీల్లో భాగంగా శనివారం నుండి జిల్లా వ్యాప్తంగా మహిళలు ఆర్టీసీ బస్సుల్లో ఉచితంగా ప్రయాణిస్తున్నారని పార్టీ జిల్లా కార్యదర్శి రిక్కుల శ్రీనివాస్‌రెడ్డి తెలిపారు. పార్టీ అగ్ర నాయకురాలు సోనియా గాంధీ పుట్టిన రోజు సందర్భంగా తెలంగాణ కాంగ్రెస్ ప్రభుత్వం మహాలక్ష్మి పథకం అమలు చేస్తోందని తెలిపారు. ఈ సందర్భంగా మండల అధ్యక్షులు ఫయాజొద్దీన్‌తో పాటు వివిధ గ్రామాలకు చెందిన పార్టీ నాయకులు, కార్యకర్తలతో కలిసి మండల కేంద్రంలో సోనియాగాంధీ పుట్టిన రోజు వేడుకలు జరుపుకున్నారు. పార్టీ ప్రకటించిన ఆరు గ్యారంటీ పథకాలు ఒక్కొక్కటిగా అమలవుతాయని తెలిపారు. ఎమ్మెల్యే గడ్డం వివేక్ వెంకటస్వామి ఆధ్వర్యంలో నియోజకవర్గం పరిధిలో ప్రభుత్వం ప్రకటించిన పథకాలు అర్హులందరికీ అందేలా కృషి చేస్తామని పేర్కొన్నారు.

సారంగాపూర్: ఇచ్చిన మాట తప్పని కాంగ్రెస్ పార్టీ మహాలక్ష్మీ పథకాన్ని అమలు చేస్తోందని కాంగ్రెస్ మండల నాయకులు దశరథ రాజేశ్వర్, బోల్లోజి నర్సయ్య, నారాయణరెడ్డి, వెంకటరమణారెడ్డి, హాదీ అన్నారు. శనివారం మండల కేంద్రంతో పాటు స్వర్ణ గ్రామంలో సోనియా గాంధీ జన్మదిన వేడుకలు ఘనంగా నిర్వహించారు. అనంతరం బాలికల ఆశ్రమ పాఠశాలలో 4వందల మంది విద్యార్థులకు పండ్లు పంపిణీ చేశారు. మహాలక్ష్మీ పథకం కింద ఆర్టీసి బస్సుల్లో ఉచిత ప్రయాణాన్ని ప్రారంభించారు. మహిళలు తెలంగాణ వ్యాప్తంగా ఆర్టీసి బస్సుల్లో ఉచితంగా ప్రయాణం చేయవచ్చని తెలిపారు. త్వరలో కాంగ్రెస్ పార్టీ ఎన్నికల్లో ఇచ్చిన ఆరు గ్యారెంటీలు అమలు చేస్తుందన్నారు. కార్యక్రమంలో లక్ష్మణ్, రాజురెడ్డి, పోతన్న, సలీం, భూమన్న, భోజాగౌడ్, ముత్యంరెడ్డి, సురేందర్, విలాస్‌రావు, రమేష్, చిన్నయ్య పాల్గొన్నారు.



జైపూర్‌లో కేక్ కట్ చేస్తున్న మహిళలు



సారంగాపూర్‌లో ఉచిత బస్సు ప్రయాణం ప్రారంభిస్తున్న నాయకులు

నవతెలంగాణ
సమగ్ర తెలుగు దినపత్రిక
2
ఆదిలాబాద్-నిర్మల్
ఆదివారం | డిసెంబర్ 10, 2023 | www.navatelangana.com

రోడ్డు భద్రత నిబంధనలు పాటించాలి

నవతెలంగాణ-కడెం



రోడ్డు భద్రత నిబంధనలను పాటిస్తూ, సైబర్ నేరాల పట్ల అప్రమత్తంగ ఉండాలని ఏఎస్సై భీంరావ్ సూచించారు. శనివారం మండలంలోని పాండ్వాపూర్ గ్రామంలో రోడ్డు భద్రత నిబంధనలు, సైబర్ నేరాలపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ప్రతి ఒక్క వాహనదారుడు వాహనానికి సంబంధించిన ధృవీకరణ పత్రాలు కలిగి ఉండాలని, హెల్మెట్ ధరించి డ్రైవింగ్ చేయడంతో పాటు లైసెన్స్ కలిగి ఉండాలన్నారు. మద్యం సేవించి వాహనదారులు నడిపితే జరిమనాలతో పాటు జైలు శిక్ష ఉంటుందన్నారు. గుర్తుతెలియని వ్యక్తుల నుండి వచ్చే సందేశాలు, కాల్స్‌కు స్పందించి వ్యక్తిగత, బ్యాంక్ వివరాలు తెలియజేయవద్దన్నారు.

ఘనంగా సోనియా గాంధీ పుట్టిన రోజు వేడుకలు

నవతెలంగాణ-కడెం



మండలంలోని కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో సోనియా గాంధీ పుట్టిన రోజు వేడుకలు మండల అధ్యక్షులు తుమ్మల మల్లేష్ యాదవ్ ఆధ్వర్యంలో శ్రేణులు శనివారం ఘనంగా జరుపుకున్నారు. ఈ సందర్భంగా మండల నాయకులు మాట్లాడుతూ తెలంగాణ ఇచ్చిన సోనియా గాంధీకి కృతజ్ఞత భావంతో తెలంగాణ రాష్ట్రంలో పార్టీని అధికారంలోకి తేవడం హర్షించదగ్గ విషయమన్నారు. ఖానాపూర్ నియోజకవర్గంలో ఎమ్మెల్యే వెడ్మ బొజ్జు పటేల్ నాయకత్వంలో అభివృద్ధి పథంలో నడుస్తుందన్నారు. ఈ కార్యక్రమంలో ఎంపీపీ ఆంటోనీ అలెగ్జాండర్, జిల్లా యువజన కాంగ్రెస్ అధ్యక్షులు పొద్దుటూరు సతీష్ రెడ్డి, ఎస్సీసెల్ జిల్లా అధ్యక్షులు తారిశంకర్, పట్టణ అధ్యక్షులు వజీద్ ఖాన్, నాయకులు కట్ల సాగర్, జాడి ఇందుర్, ధర్మయ్య పాల్గొన్నారు.

బస్సుల్లో ఉచితం..అతివల హర్షం

- రెండు గ్యారెంటీలను ప్రారంభించిన కలెక్టర్
- సంబరాల్లో కాంగ్రెస్ శ్రేణులు



నిర్మల్‌లో ఉచిత బస్సు ప్రయాణం పోస్టర్లను విడుదల చేస్తున్న కలెక్టర్ ఆశిష్ సంగ్వాన్, అధికారులు

నవతెలంగాణ-నిర్మల్

ఎన్నికల సమయంలో ఇచ్చిన ఆరు గ్యారంటిల్లో ఒక్కటైన మహాలక్ష్మీ పథకం ఉచిత బస్సు ప్రయాణం సోనియా గాంధీ పుట్టిన రోజు అమలు చేయడంపై మహిళలు హర్షం వ్యక్తం చేస్తున్నారు.తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం శ్రీకారం చుట్టిన రాజీవ్ ఆరోగ్య శ్రీ, మహిళలకు ఆర్టీసీ బస్‌లో ఉచిత ప్రయాణం రెండు గ్యారెంటీల అమలు కార్యక్రమాన్ని శనివారం కలెక్టర్ ఆశిష్ సంగ్వాన్ ప్రారంభించారు. తొలుత జిల్లాలోని ఏరియా ఆస్పత్రిలో ఆరోగ్య శ్రీని ప్రారంభించి కరపత్రాలను విడుదల చేశారు. అక్కడి నుంచి బస్టాండ్‌లో ఉచిత బస్సు ప్రయాణాన్ని ప్రారంభించి సంబంధిత పోస్టర్లను విడుదల చేశారు. మహిళాలకు ప్రభుత్వం ప్రవేశపెట్టిన ఉచిత బస్సు ప్రయాణం ఎంతో ఉపయోగపడుతుందని, ఆర్థికంగా ఎదుగుదలతకు తొడ్పడుతుందని ఈ సందర్భంగా కలెక్టర్ ఆశిష్ సంగ్వాన్ అన్నారు. ఈ కార్యక్రమంలో ఆదనపు కలెక్టర్ కిషోర్ కుమార్, డీఎంహెచ్ఓ డా. దన్‌రాజ్, సంబంధిత జిల్లా అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

లక్ష్మణచాంద : తెలంగాణ రాష్ట్ర కల సాకారం చేసిన కాంగ్రెస్ నాయకురాలు సోనియా గాంధీ పుట్టినరోజు సందర్భంగా పథకాన్ని ప్రారంభించడాన్ని స్వాగతిస్తు శనివారం కాంగ్రెస్ నాయకులు మండల కేంద్రంలో సంబరాలు జరుపుకున్నారు. అనంతరం ఉచిత బస్సు ప్రయాణంపై మహిళలు, కాంగ్రెస్ నాయకులు కేక్‌కట్ చేసి స్వీట్లు తినిపించుకున్నారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఇచ్చిన మాట నిలబెట్టుకున్నారన్నారు. ప్రమాణ స్వీకారం చేసిన రెండు రోజుల్లోనే రూ.10 లక్షల ఆరోగ్య శ్రీతో రెండు గ్యారంటీ పథకాలను అమలు చేసి తెలంగాణ ప్రజలకు ప్రభుత్వం బలమైన భరోసా కల్పించిందని సంతోషం వ్యక్తం చేశారు.



లక్ష్మణచాందలో...

ఈ కార్యక్రమంలో నాయకులు అట్ల రాంరెడ్డి, అబ్బడి ప్రతాప్ రెడ్డి, ఒడ్నాల రాజేశ్వర్, అట్ల రవీంధర్ రెడ్డి, ఈటెల శ్రీనివాస్, నగేష్, సమ్మెట రవి ఉన్నారు.

దిలావర్‌పూర్ : తెలంగాణ ఆశయాన్ని నెరవేర్చిన సోనియా గాంధీ జన్మదిన వేడుకలను శనివారం దిలావర్‌పూర్, నర్సాపూర్(జి) మండలల్లో కాంగ్రెస్ నాయకులు ఘనంగా నిర్వహించారు. ఆర్టీసీ బస్సులో కేక్ కట్ చేసి సంబరాలు జరుపుకున్నారు. ప్రభుత్వ ఆస్పత్రిలో రోగులకు పండ్లను పంపిణీ చేశారు. అనంతరం ప్రభుత్వం మహిళల కోసం ప్రవేశపెట్టిన మహాలక్ష్మి ఉచిత బస్సు ప్రయాణ పథకాన్ని నాయకులు మహిళలకు, బస్సు డ్రైవర్‌కు పుష్పగుచ్చాలు ఇచ్చి ప్రారంభించారు. ఈ సందర్భంగా కాంగ్రెస్ నాయకులు ఇంద్రకరణ్ రెడ్డి, సాగర్ రెడ్డి మాట్లాడుతూ కాంగ్రెస్ ప్రభుత్వం మేనిఫెస్టోలో తెలిపిన విధంగా తెలంగాణ రాష్టంలో ముందుగా మహాలక్ష్మి పథకం ద్వార మహిళలకు ఉచిత బస్సు ప్రయాణం కల్పించడం అభినందనీయమన్నారు. ఈ కార్యక్రమంలో నాయకులు అరుగుల రమణ, కోడె శ్రీనివాస్, షేక్ వసీం, కట్కం రాజారెడ్డి, నర్సారెడ్డి, కోడె విజయ్, బొల్ల ధయాకర్, అడుగుమీది నారాయణరెడ్డి, దయానంద్, ఉమామహేశ్వర్, ప్రవీణ్, శ్యామ్ రెడ్డి, కిష్టారెడ్డి, కోడే సాయన్న, అజీమ్, అబ్దుల్ల, శ్రీధర్, ఉద్గిరి నరసయ్య, సాజిద్ బాబా పాల్గొన్నారు.




దిలావర్‌పూర్‌లో...

కుభీర్ : ఎన్నికలో ఇచ్చిన హామీల మేరకు కాంగ్రెస్ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఆరు గ్యారెంటిలో మొదటగా మహాలక్ష్మి పథకంలో మహిళలకు ఉచిత బస్ సౌకర్యం, రూ.10లక్షలతో ఆరోగ్య శ్రీ పథకాన్ని శనివారం ప్రారంభించడంతో మండల కేంద్రంలో సంబరాలు జరుపుకున్నారు. జీపు స్టాండ్ వద్ద మహిళలకు ఉచిత బస్ సౌకర్యాన్ని మండల కాంగ్రెస్ నాయకులు బస్‌కు ప్రత్యేక పూజలు చేసి మహిళలకు బస్‌లో ప్రయాణం చేస్తున్న మహిళలను సన్మానించారు. ఈ కార్యక్రమంలో మండల మైనార్టీ సెల్ అధ్యక్షడు జావిద్ ఖాన్, నాయకులు బంక బాబు, జావిద్ ఖాన్, బషీర్ విలాస్ ఉన్నారు



కుభీర్‌లో ఆర్టీసీ డ్రైవర్‌ను సన్మానించి మిఠాయిలు తినిపిస్తున్న కాంగ్రెస్ నాయకులు

సికిల్‌సెల్ స్క్రీనింగ్ క్యాంప్



నవతెలంగాణ-ఆదిలాబాద్‌రూరల్

తెలంగాణ రెసిడెన్షియల్ స్కూల్ అండ్ కాలేజీ (బాలుర)లో అంకోలి ప్రాథమిక ఆరోగ్య కేంద్రం డా.సర్ఫరాజ్ ఆధ్వర్యంలో సికిల్ సెల్ స్క్రీనింగ్ క్యాంప్‌ను నిర్వహించారు. విద్యార్థుల నుంచి రక్త నమూలాను సేకరించారు. సికిల్ సెల్‌ను గుర్తించడంలో భాగంగా ప్రభుత్వ సూచనల మేరకు ఈ క్యాంప్ నిర్వహించడం జరిగిందని వైద్యులు తెలిపారు. ఈ కార్యక్రమంలో హెల్త్ సూపర్‌వైజరులు బొమ్మెత సుభాష్, ఆడే సురేష్, హెల్త్ అసిస్టెంటులు కె.శ్రీవాణి, నల్ల ఈశ్వర్ రెడ్డి, పవార్ ప్రేమ్‌సింగ్, ప్రిన్సిపాల్ అగస్టీన్ పాల్గొన్నారు.

సీతక్కకు పంచాయతీరాజ్ శాఖ కేటాయింపుపై హర్షం

నవతెలంగాణ-ఆదిలాబాద్‌టౌన్

తెలంగాణ నూతన పంచాయతీరాజ్ మంత్రిగా సీతక్కను నియమించడం పట్ల జిల్లా పంచాయితీ కార్యదర్శులు ఆనందం వ్యక్తం చేస్తున్నట్లు ఆ సంఘం జిల్లా అధ్యక్షులు చంద్రశేఖర్, ప్రధాన కార్యదర్శి ప్రశాంత్ శనివారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ఎన్నో సంవత్సరాలుగా ఉన్న కార్యదర్శుల సమస్యల పరిష్కారం దిశగా మంత్రి గతంలో సమ్మె సమయంలో హామీ ఇచ్చారని, ఇపుడు వాటిని నెరవేరుస్తారని తామంతా నమ్ముతున్నట్లుగా భావిస్తున్నట్లు తెలిపారు.

నేడు మండలంలో ఎమ్మెల్యే పర్యటన

నవతెలంగాణ-ఇంద్రవెల్లి

ఖానాపూర్ ఎమ్మెల్యే వెడ్మ బొజ్జు పటేల్ ఆదివారం మండలంలో పర్యటించనున్నట్లు కాంగ్రెస్ నాయకులు ముకాడె ఉత్తం తెలిపారు. మండల కేంద్రంతో పాటు ధనోరా గ్రామంలో పర్యటిస్తారని చెప్పారు. శాసనసభ ఎన్నికల్లో గెలుపొందిన తరువాత మొదటి సారిగా మండలానికి రానుండటముతో పార్టీ నాయకులతో పాటు ప్రజలు అధిక సంఖ్యలో పాల్గొనాలని కోరారు.

విద్యార్థులు భావి శాస్త్రవేత్తలుగా ఎదిగేలా కృషి చేయాలి

- సైన్స్ ఎగ్జిబిషన్‌ను ప్రారంభించిన కలెక్టర్



విద్యార్థుల ఎగ్జిబిట్స్ వివరాలు తెలుసుకుంటున్న కలెక్టర్ రాహుల్‌రాజ్

నవతెలంగాణ-ఆదిలాబాద్‌టౌన్

విద్యార్థులకు సైన్స్‌పై అవగాహన కల్పించడంతో పాటు ఉపాధ్యాయులు ప్రోత్సహిస్తూ భావి శాస్త్రవేత్తలుగా ఎదిగేల కృషి చేయాలని జిల్లా కలెక్టర్ రాహుల్ రాజ్ అన్నారు. శనివారం లిటిల్ స్టార్ పాఠశాలలో సైన్స్ ఎగ్జిబిషన్ నిర్వహించగా కలెక్టర్ ముఖ్య అథితిగా హాజరై ప్రారంభించారు. ముందుగా పాఠశాల ఆవరణలో మొక్కలు నాటి నీరు పోశారు. అనంతరం విద్యార్థుల ప్రదర్శనాలను ప్రారంభించారు. వారు తయారు చేసిన ప్రదర్శనల గురించి అడిగి తెలుసుకున్నారు. కాగా తన కుతూరు రితిక కూడా ప్రదర్శించగా వాటి గురించి అడిగి తెలుసుకుంటు సంబరపడ్డారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ రాహుల్ రాజ్ మాట్లాడుతూ విద్యార్థులను భావి శాస్త్రవేత్తలుగా తీర్చిదిద్దడంలో సైన్స్ ప్రదర్శనాలు ఎంతగానో దోహదం చేస్తాయన్నారు. వారిలోని నైపుణ్యాలు, సృజనాత్మకతను వెలికి తీయడానికి ఇలాంటి సైన్స్ ఎగ్జిబిషన్లు వేదికలని అన్నారు. ఉపాధ్యాయులు వారికి ప్రోత్సహం అందిస్తు రాణించేలా కృషి చేయాలన్నారు. సైన్స్, గణితం ఈ రెండు సబ్జెక్టులు ముఖ్యమని, వాటిల్లో ప్రావీణ్యం సాదించేల తరగతిలో బోధనలుండాలని, విద్యార్థులు కూడా వీటిపై ఆసక్తి పెంచుకోవాలన్నారు. 8, 9, 10వ తరగతి విద్యార్థులు ఈ సబ్జెక్టులపై మంచి పట్టు సాధిస్తే భవిష్యత్తులో ఎంతో ఉపయోగంగా ఉంటుందన్నారు. ఇదిలా ఉంటే అటూ లిటిల్ ఫ్లవర్ పాఠశాలలోనూ సైన్స్ ఫెయిర్‌ను నిర్వహించారు. జిల్లా సైన్స్ అధికారి రఘురమణ ముఖ్య అథితిగా హాజరై ప్రారంభించారు. అనంతరం విద్యార్థులు తయారు చేసిన ఎగ్జిబిట్లను పరిశీలించి వారిని అభినందించారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ప్రిన్సిపల్ దేవేందర్ పటాస్కర్, ఉపాధ్యాయులున్నారు. విద్యార్థులు సృజనాత్మకతతో వారిలోని నైపుణ్యాలు వెలికి తీస్తు ప్రయోగాలు చేయడం అభినందనీయమని జిల్లా సైన్స్ అధికారి రఘురమణ అన్నారు. ఈ కార్యక్రమంలో డీఈఓ ప్రణీత, స్టార్ పాఠశాల ప్రిన్సిపల్ కమలకర్ రెడ్డి, సిబ్బంది, విద్యార్థులు పాల్గొన్నారు.

మంత్రివర్గంలో మాలలకు ప్రాతినిధ్యం కల్పించాలి

- మాల సంక్షేమ సంఘం జిల్లా అధ్యక్షుడు అల్లూరి భూమన్న

నవతెలంగాణ ఆదిలాబాద్ అర్బన్

రాష్ట్ర వ్యాప్తంగా జరిగిన అసెంబ్లీ ఎన్నికల్లో మాల సామాజిక వర్గానికి చెందిన తొమ్మిది మంది ఎమ్మెల్యేలు గెలుపొందరని మంత్రివర్గంలో మాలలకు ప్రాతినధ్యం ఇవ్వాలని మాల సంక్షేమ సంఘం జిల్లా అధ్యక్షుడు అల్లూరి భూమన్న కోరారు. శనివారం ప్రెస్‌క్లబ్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ తెలంగాణ రాష్ట్రంలో ఏర్పడ్డ నూతన ప్రభుత్వానికి శుభాకాంక్షలు తెలియజేస్తూ జిల్లాలో అసెంబ్లీ ఎన్నికలను ఎలాంటి అల్లర్లకు తావివ్వకుండా ప్రశాంతంగా నిర్వహించిన ఆదిలాబాద్ జిల్లా కలెక్టర్ రాహుల్ రాజ్, ఎస్పీ ఉదయ్ కుమార్‌తో పాటు ఎన్నికల అధికారులు, పోలీసు సిబ్బందికి ఈ సందర్భంగా కృతజ్ఞతలు తెలిపారు. నూతన ప్రభుత్వం రాజ్యాంగబద్ధంగా ప్రజాస్వామ్య విలువలకు కట్టుబడి అణగారిన వర్గాలైన మాలలకు రాజకీయ, సామాజికంగా సముచిత స్థానం కల్పిస్తూ ఉమ్మడి ఆదిలాబాద్ చెన్నూర్ నుంచి గెలుపొందిన గడ్డం వివేక్ వెంకటస్వామికి మంత్రివర్గంలో చోటు ఇవ్వాలని కోరారు. గతంలో పాలించిన ఏ ప్రభుత్వాలు కూడా మాలీలకు సరైన ప్రాధాన్యత ఇవ్వాలేదన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వ హయంలోనైన తమకు తగిన గుర్తింపు ఇవ్వాలన్నారు. ఉమ్మడి జిల్లాలోని చెన్నూర్, బెల్లంపల్లి స్థానాల్లో మాల సామాజిక వర్గానికి అభ్యర్థులు గెలుపొందారని, ఇందులో వివేక్‌కు మంత్రి వర్గంలో చోటు ఇవ్వాలని కోరారు. కాంగ్రెస్ తమ డిమాండ్‌ను పరిష్కరిస్తుందనే నమ్మకం ఉందన్నారు. భవిష్యత్తులో కూడా మాలల సమస్యలపై సానుకూలంగా వ్యవహరించాలని కోరారు. అదే విధంగా ఎన్నికల్లో ఇచ్చిన ఆరు గ్యారంటిలను కూడా పక్కగా అమలు చేస్తుందనే నమ్మకం తమకు ఉందన్నారు. ఈ కార్యక్రమంలో అర్క దేవిదాస్, కొప్పుల వరప్రసాద్, గైని ప్రకాష్, ప్రభుదాస్, సత్యనారాయణ, సాయిబాబా, బొమ్మెత సుభాష్, నిమ్మల ప్రశాంత్, క్రాంతి, చిల్కా అరుణ్, గంపల ప్రభాకర్, బేర శ్రీనివాస్, సంఘం నాయకులు పాల్గొన్నారు.



విలేకరుల సమావేశంలో మాట్లాడుతున్న మాల సంక్షేమ సంఘం అధ్యక్షులు భూమన్న

విద్యార్థుల ఆరోగ్యంపై శ్రద్ధ వహించాలి



నవతెలంగాణ-నార్నూర్

చలికాల నేపథ్యంలో విద్యార్థుల ఆరోగ్యం పట్ల పాఠశాల సిబ్బంది శ్రద్ధ వహించాలని డా. రాంబాబు సూచించారు. శనివారం మండల కేంద్రంలోని బాలికల ఆశ్రమ పాఠశాలలో వైద్య శిబిరం నిర్వహించారు. ఈ సందర్భంగా పాఠశాలలో 10 మంది బాలికలకు సికిల్ సెల్ ఎనీమియా రక్త వైద్య పరీక్షలు చేశారు. జ్వరం, జలుబు, దగ్గు దురద ఉన్న వారికీ ఉచిత మందులు పంపిణీ చేశారు. ఇందులో హెచ్ఈఓ నాందేవ్, హెల్త్ సూపర్‌వైజర్ చరణ్ దాస్, ప్రధానోపాధ్యాయుడు జాదవ్ విఠల్, వైద్య సిబ్బంది అదీప్, హిమ, ఈశ్వర్, జంగుబాయి, పాఠశాల సిబ్బంది ఉన్నారు.

విభిన్న వంటకాలతో ఫుడ్ ఫెస్టివల్



నవతెలంగాణ-ఆదిలాబాద్‌టౌన్

మావలలోని శ్రీచైతన్య పాఠశాలలో ఫ్లేవర్ కార్నివాల్ (ఫుడ్ ఫెస్టివల్)ను శనివారం ఘనంగా నిర్వహించారు. ఇందులో సుమారుగా 50కు పైగా విభిన్న రుచులతో కూడిన ఆహారపదార్థాలను విద్యార్థులు ఇంట్లో తయారు చేసి తీసుకువచ్చారు. విద్యార్థులతో పాటు వారి తల్లిదండ్రులు ఈ ఫెస్టివల్ లో ఉత్సాహంగా పాల్గొన్నారు. ఇతర పాఠశాలల విద్యార్థులు, తల్లిదండ్రులు సైతం పాల్గొన్నారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా డీఈఓ ప్రణీత హాజరై ప్రారంభించారు. అనంతరం స్టాళ్లను సందర్శిస్తూ రుచులను చూసి విద్యార్థులను అభినందించారు. విద్యార్థులు కొనుగోలు, అమ్మకాల గురించి తద్వారా వచ్చే లాభ నష్టాల గురించి, అవగాహన వస్తుందని డీఈఓ పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయులు శ్రీనివాస్, ప్రైమరీ, ప్రీప్రైమరీ ఇన్‌చార్జి ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

ఎమ్మెల్యేను కలిసిన సుంకిడి గ్రామస్తులు



నవతెలంగాణ-తలమడుగు

బోథ్ ఎమ్మెల్యే అనిల్ జాదవ్‌ను మండలంలోని సుంకిడి గ్రామస్తులు శనివారం మర్యాద పూర్వకంగా కలిశారు. ఎమ్మెల్యేకు పుష్పగుచ్చం అందించి శాలువతో సన్మానించారు. అత్యధిక మెజారిటీతో గెలిచినందుకు గ్రామస్తులు, యువకులు శుభాకాంక్షలు తెలిపారు. గ్రామాభివృద్ధికి ప్రత్యేక చొరువ చూపాలని ఈ సందర్భంగా కోరారు. ఈ కార్యక్రమంలో జాదవ్ అజయ్, రమాకాంత్, పరిటాల రవి, ఉషన్న పాల్గొన్నారు.

ఎమ్మెల్యే కోవ లక్ష్మీని కలిసిన కార్యదర్శులు



నవతెలంగాణ-నార్నూర్

ఆసిఫాబాద్ ఎమ్మెల్యే కోవ లక్ష్మీని మండలంలోని ఆయా గ్రామాల కార్యదర్శులు మర్యాద పూర్వకంగా కలిశారు. పుష్పగుచ్చం అందించి శుభాకంక్షలు తెలిపారు. అనంతరం శాలువాతో సన్మానించి కార్యదర్శుల సమస్యలను విన్నవించారు. వాటి పరిష్కరం కృషి చేస్తానని ఈ సందర్భంగా ఎమ్మెల్యే భరోసా ఇచ్చారు. ఈ కార్యక్రమంలో సుపరింటెండెంట్ గంగాసింగ్, కార్యదర్శులు కొల రాజ శేఖర్, విజయ్ కుమార్, శ్రీనివాస్, అనురాగ్, రాంసింగ్, అవినాష్, శ్రీనివాస్, శంకర్ ఉన్నారు.

ఉచిత ప్రయాణంతో కాంగ్రెస్ సంబరాలు

నవతెలంగాణ-ఇంద్రవెల్లి

కాంగ్రెస్ ప్రభుత్వం అధికారం చేపట్టిన రెండు రోజుల్లో మహిళలకు ఉచితంగా బస్సులో ప్రయాణం కల్పించడాన్ని కాంగ్రెస్ నాయకులు సంబరాలు జరుపుకున్నారు. ఈ సందర్భంగా స్థానిక ఆర్టీసీ బస్సు స్టాండ్‌లో డ్రైవర్, కండక్టర్‌లకు శాలువతో సన్మానించారు. ఈ సందర్భంగా ఎండీ జహీర్ మాట్లాడుతూ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఆరు గ్యారంటిల్లో రెండు పథకాలను అధికారంలోకి వచ్చిన రెండు రోజుల్లోనే మహాలక్ష్మి పథకం, రాజీవ్ ఆరోగ్య చేయూత వంటి పథకాలను అమలు చేశారన్నారు. మిగిలిన హామీలను త్వరలో అమలు చేస్తామన్నారు. ఈ కార్యక్రమంలో మండల నాయకులు ముకాడే విష్ణు, సొన్ కాంబ్లే, లక్ష్మీ, ప్రకాష్, మసూద్ పాల్గొన్నారు.

నవతెలంగాణ
సమగ్ర తెలుగు దినపత్రిక
కుమురంభీం ఆసిఫాబాద్
ఆదివారం | డిసెంబర్ 10, 2023 | www.navatelangana.com

పురుగులమందు తాగి యువకుడి ఆత్మహత్య

నవతెలంగాణ-సిఫాబాద్



మద్యం మత్తులో పురుగుల మందు తాగి యువకుడు ఆత్మహత్య చేసుకున్న ఘటన మండలంలోని సాలెగూడాలో చోటుచేసుకుంది. బంధువులు తెలిపిన వివరాల ప్రకారం గ్రామానికి చెందిన చాపిడి రావూజీ, ప్రవీణ కుమారుడు చాపిడి శంకర్(24) గత కొంతకాలంగా మద్యానికి బానిసయ్యాడు. ఇదే క్రమంలో శుక్రవారం రాత్రి మద్యం మత్తులో మద్యం అనుకొని ఇంట్లో ఉన్న పత్తి మందు తాగాడు. వెంటనే గుర్తించిన కుటుంబ సభ్యులు ఆయనను జిల్లా కేంద్రంలోని ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. అప్పటికే శంకర్ మృతి చెందినట్లు వైద్యులు తెలిపారు.

చిన్నసిద్ధాపూర్‌లో హత్య కేసు విచారణ

నవతెలంగాణ-బెజ్జూరు



మండలంలోని చిన్నసిద్ధాపూర్ గ్రామంలో జరిగిన ఆదే పురుషోత్తం హత్యపై శనివారం కౌటాల సీఐ సాదిక్‌పాషా విచారణ చేపట్టారు. హత్య జరిగిన సంఘటన స్థలాన్ని పరిశీలించి చుట్టుప్రక్కల వారిని హత్యకు గల కారణాలను అడిగి తెలుసుకున్నారు. దేనికోసం హత్య జరిగింది అనే వివరాలను క్షుణ్ణంగా పరిశీలించి వివరాలను సేకరించారు. నింధితుడు టాకిరె వసంత్ తీరుపై ఆరా తీశారు.

మంచిర్యాలలో మహాలక్ష్మి పథకాన్ని ప్రారంభించిన కలెక్టర్



నవతెలంగాణ-నస్పూర్

రాష్ట్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన మహాలక్ష్మి పథకం ద్వారా తెలంగాణ రాష్ట్రంలో టీఎస్‌ఆర్‌టీసీ బస్సులో మహిళలందరికీ ఉచిత ప్రయాణం అవకాశం కల్పించడం జరిగిందని కలెక్టర్ బదావత్ సంతోష్ అన్నారు. శనివారం జిల్లా కేంద్రంలోని ఐబీ చౌరస్తాలో జిల్లా రవాణా శాఖ అధికారి కిష్టయ్య ఆర్టీసీ మంచిర్యాల డిపో మేనేజర్ వి.రవీంద్రనాథ్‌తో కలిసి మహాలక్ష్మి పథకం స్మార్ట్ కార్డులను మహిళలకు అందజేసి, బస్సును ప్రారంభించి మంచిర్యాల నుంచి సీసీసీ వరకు బస్సులో ప్రయాణం చేశారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ మహిళలు మహాలక్ష్మి స్మార్ట్ కార్డు పొందాలని తెలిపారు. ప్రభుత్వ నిబంధనల మేరకు పల్లె వెలుగు, ఎక్స్‌ప్రెస్ బస్సులలో మహాలక్ష్మి కార్డు కలిగిన బాలికలు, మహిళలు, ట్రాన్స్ జెండర్లు ఉచితంగా ప్రయాణం చేయవచ్చని తెలిపారు. అనంతరం జిల్లా కేంద్రంలోని ప్రభుత్వ ఆసుపత్రిలో జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి డా.సుబ్బారాయుడు, జిల్లా రవాణా శాఖ అధికారి కిష్టయ్యతో కలిసి రాజీవ్ ఆరోగ్యశ్రీ పథకం సంబంధిత గోడ ప్రతులను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ఆరోగ్య తెలంగాణ లక్ష్యంగా రాజీవ్ ఆరోగ్యశ్రీ పథకంలో భాగంగా లబ్ధిదారులకు పరిమితిని రూ.10 లక్షల పెంచడం జరిగిందని అన్నారు. అర్హులైన లబ్ధిదారులకు ఉచితంగా కార్పొరేట్ వైద్యాన్ని అందించడం జరుగుతుందని, అన్ని రాజీవ్ ఆరోగ్యశ్రీ ఎంపానల్డ్ ఆస్పత్రుల్లో తక్షణమే అమలు చేయడం జరుగుతుందని, ప్రజలకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా పథకం అమలు చేసేందుకు పటిష్టమైన చర్యలు చేపట్టడం జరుగుతుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో సంబంధిత శాఖల అధికారులు పాల్గొన్నారు.

పేద ప్రజలకు న్యాయం చేస్తాం:సీపీఐ(ఎంఎల్)



నవతెలంగాణ-నస్పూర్

పేద ప్రజలకు ఇల్లు ఇప్పించడంలో ఎవరెన్ని కుట్రలు చేసిన పేద ప్రజలకు న్యాయం చేస్తామని సీపీఐ(ఎంఎల్) న్యూ డెమోక్రసీ పార్టీ జిల్లా కార్యదర్శి మేకల రామన్న అన్నారు. శనివారం శ్రీరాంపూర్ ఏరియాలో విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ చెన్నూర్ మండలం బాబురావు పేట గ్రామం శివారులో ఇంటి స్థలాల కోసం గత 9 నెలల నుండి పేదలు పోరాటం చేస్తున్నారన్నారు. పోరాటానికి ముందు నుంచి తమ పార్టీ సంపూర్ణమైన మద్దతు తెలియజేయడం జరిగిందని పేర్కొన్నారు. సీపీఐ(ఎం) ఆధ్వర్యంలో నిర్వహించిన ఇంటి స్థలాల పోరాట కమిటీ నాయకులు ఎండి అవేజ్, ఎ శంకర్, ఎ.మధు, కె.ప్రసన్న, జి.పోసక్క, సీపీఐ(ఎంఎల్) న్యూడెమోక్రసీ జిల్లా కమిటీతో సమావేశం నిర్వహించి వాస్తవ పరిస్థితులను వివరించారు. పేద ప్రజలకు ఇళ్ల పట్టాలు ఇప్పించే వరకు పోరాడుతామని తెలిపారు. ఐఎఫ్టీయూ రాష్ట్ర ఉపాధ్యక్షుడు కట్ట విశ్వనాథ్, ఏఐకేఎంఎస్ రాష్ట్ర నాయకులు ఎల్ భీమన్న, ఐఎఫ్టీయూ మంచిర్యాల జిల్లా ఉపాధ్యక్షులు కె.దేవన్న, జిల్లా సహాయ కార్యదర్శి బి గోపీనాథ్ పాల్గొన్నారు.

మహిళా సాధికారత దిశగా ప్రభుత్వం అడుగులు



నవతెలంగాణ-తాండూర్

మహిళా సాధికారత దిశగా కాంగ్రెస్ ప్రభుత్వం అడుగులు వేస్తుందని కాంగ్రెస్ మహిళా సీనియర్ నాయకురాలు హైమావతి అన్నారు. శనివారం మహిళలకు ఉచిత బస్సు ప్రయాణం మహాలక్ష్మి పథకం ప్రారంభోత్సవంలో ఆమె పాల్గొన్నారు మహిళలతో కలిసి ఆర్టీసీ బస్సులో ప్రయాణం చేశారు. మహిళల అనుభవాలను తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ 6 గ్యారంటీలో భాగంగా మహాలక్ష్మి పథకం ప్రారంభించడం జరిగిందని తెలిపారు. మహిళల ఇబ్బందులను దృష్టిలో ఉంచుకొని రూ.500 కే గ్యాస్ త్వరలో ప్రభుత్వం ప్రారంభించనున్నట్లు తెలిపారు. బీఆర్ఎస్ ప్రభుత్వం మహిళల అభ్యున్నతికి కృషి చేయడంలో విఫలమైందని తెలిపారు.

13న మండల సర్వసభ్య సమావేశం

నవతెలంగాణ-బెజ్జూరు

ఈ నెల 13న మండల సర్వసభ్య సమావేశాన్ని నిర్వహిస్తున్నట్టు ఎంపీడీఓ మాధవి శనివారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ఉదయం 11 గంటలకు మండల పరిషత్ కార్యాలయంలో సమావేశం ఉంటుందని, దీనికి అధికారులు, ఎంపీటీసీలు, సర్పంచ్‌లు తప్పకుండా హాజరుకావాలని ఆమె కోరారు.

మహాలక్ష్మి, ఆరోగ్యశ్రీ పథకాలు ప్రారంభం

నవతెలంగాణ-ఆసిఫాబాద్



కాంగ్రెస్ మేనిఫెస్టోలో పొందుపరిచిన మహాలక్ష్మి పథకంలో భాగంగా మహిళలకు ఉచిత బస్సు ప్రయాణం తోపాటు, ఆరోగ్యశ్రీ పరిమితిని ఐదు లక్షల నుంచి పది లక్షలకు పెంచే పథకాన్ని కేంద్రంలోని ఆసుపత్రి ఆవరణలో కలెక్టర్ బొర్కాడే హేమంత్, డీపో మేనేజర్ శ్రీధర్, జిల్లా వైద్యాధికారి తుకారాం బట్, కాంగ్రెస్ నియోజకవర్గ ఇన్‌చార్జి శ్యాం నాయక్‌తో కలిసి జండా ఊపి ప్రారంభించారు. అనంతరం ఆరోగ్యశ్రీ వాల్ పోస్టర్లను విడుదల చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ మహిళలు ఉచిత బస్సు ప్రయాణం వినియోగించుకోవాలని సూచించారు. ఆర్డినరీ ఎక్స్ ప్రెస్ బస్సులలో ఇది అందుబాటులో ఉంటుందన్నారు. మహాలక్ష్మి పథకం ప్రారంభం కావడంతో ఆర్టీసీ బస్సుల వద్ద మహిళలు పెద్ద ఎత్తున ఉండడం కనిపించింది. ప్రభుత్వ నిర్ణయం పట్ల పలువురు మహిళలు హర్షం వ్యక్తం చేశారు. ఆరోగ్యశ్రీ పరిమితి రూ.ఐదు లక్షలు నుంచి రూ.10 లక్షలు పెంచడం జరుగుతుందన్నారు, పేదలకు ఇది



ఎంతగానో సహాయపడుతుందని తెలిపారు.

ఘనంగా సోనియా జన్మదిన వేడుకలు

జిల్లా కేంద్రంలో సోనియాగాంధీ జన్మదిన వేడుకలను కాంగ్రెస్ శ్రేణులు నియోజకవర్గ ఇన్‌ఛార్జి శ్యానాయక్ ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. అంబేద్కర్ చౌక్ వద్ద కేక్ కట్ చేసి బాణాసంచా పేల్చి సంబరాలు చేసుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తెలంగాణ ప్రజల ఆకాంక్షను నెరవేర్చిన గొప్ప మహిళ సోనియా గాంధీ అని కొనియాడారు. అటువంటి వ్యక్తి పేరును తెలంగాణ ఉన్నంతకాలం ప్రతి ఒక్కరు గుర్తుంచుకోవాలని, తెలంగాణ దేవత సోనియా అని అన్నారు. సోనియా గాంధీ జన్మదినం సందర్భంగా ప్రభుత్వాసుపత్రిలో కాంగ్రెస్ శ్రేణులు రక్తదానం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో మహిళ నాయకురాలు మంగ, జిల్లా నాయకులు గూండా శ్యామ్, మహమ్మద్ ఆసిఫ్, చరణ్, మల్లికార్జున్, రాజేంద్ర కుమారి, మురళి, నారాయణ పాల్గొన్నారు.

గుర్తింపు ఎన్నికలు సంస్థ భవిష్యత్తును నిర్ణయిస్తుంది

- సింగరేణి కాలరీస్ వర్కర్స్ యూనియన్(ఏఐటీయూసీ) రాష్ట్ర అధ్యక్షుడు వాసిరెడ్డి సీతారామయ్య

నవతెలంగాణ-నస్పూర్


2023లో జరిగే సింగరేణి గుర్తింపు ఎన్నికలు సంస్థ భవిష్యత్తును నిర్ణయిస్తాయని, కార్మికులందరూ హక్కులు సాధించే ఏఐటీయూసీ యూనియన్‌ను గెలిపించాలని సింగరేణి కాలరీస్ వర్కర్స్ యూనియన్ (ఏఐటీయూసీ) రాష్ట్ర అధ్యక్షుడు వాసిరెడ్డి సీతారామయ్య అన్నారు. శనివారం ఎస్ఆర్పీ-3 గనిపై నిర్వహించిన గేట్ మీటింగ్లో ఆయన పాల్గొని మాట్లాడారు. ఈ సారి సంస్థలో జరిగే ఎన్నికలు సంస్థ భవిష్యత్తుని నిర్ణయించే ఎన్నికలని, గత 11 సంవత్సరాలుగా గుర్తింపు సంఘంగా ఉన్న టీబీజీకేఎస్ రాష్ట్ర ప్రభుత్వానికి యాజమాన్యానికి అనుకూలంగా వ్యవహరిస్తూ సంస్థకు వచ్చిన లాభాల నుంచి రూ.వేలకోట్లు దారి మళ్లించడం వల్ల ఈనాడు సంస్థ ఆర్థికంగా బలహీన పడిందన్నారు. కార్మికులకు చెల్లించాల్సిన లాభాల వాటా, వేజ్ బోర్డు, ఏరియర్స్, జీతాలు చెల్లించుట కొరకు యాజమాన్యం బ్యాంకుల చుట్టూ ప్రదక్షిణలు చేయవలసిన పరిస్థితి ఏర్పడిందన్నారు. విజ్ఞులైనటువంటి సింగరేణి కార్మికవర్గం ఈసారి సంస్థ భవిష్యత్తును దృష్టిలో ఉంచుకొని సింగరేణి కార్మికులకు అనేక హక్కులు సాధించి పెట్టిన కార్మికుల సమస్యలపైన నిరంతరం కృషి చేసే సింగరేణి కాలరీస్ వర్కర్స్ యూనియన్ (ఏఐటీయూసీ)ని గెలిపించడం ద్వారా మాత్రమే సింగరేణి భవిష్యత్తు ఉంటుందని, తద్వారా



సింగరేణిలో నూతన భూగర్భ గనులు ఏర్పాటు చేసుకోవడానికి అవకాశం ఉంటుందని తెలిపారు. అలాగే సింగరేణిలో పనిచేస్తున్న ప్రతి కార్మికుడికి 250 గజాల భూమి యాజమాన్యమే ఇచ్చి రూ.20 లక్షల వడ్డీ లేని రుణాన్ని ఇప్పించేందుకు కృషి చేస్తామని, నూతన ఉద్యోగ అవకాశాలు కల్పిస్తామని, కోల్ ఇండియాలో కార్మికులకు చెల్లిస్తున్నటువంటి ఐటీని సింగరేణిలో కూడా అధికారుల మాదిరి కార్మికులకు యాజమాన్యం ద్వారా చెల్లించే విధంగా చేస్తామని అన్నారు. ఈ సందర్భంగా సింగరేణి కాలరీస్ వర్కర్స్ యూనియన్ సాధించిన హక్కులు నూతనంగా సాధించబోయే హక్కులకు ఆకర్షితులై ఎస్ఆర్పీ-3 తెలంగాణ బొగ్గు గని కార్మిక సంఘం, ఇతర కార్మిక సంఘాల నుంచి కారబోయిన సారయ్య (హెచ్ఓపి), గంగా ప్రసాద్ (ఓవర్ మెన్), విలాస్ వర్మ (సర్దార్), సాయి తేజ, వంశీ 130 మంది కార్మికులు సీతారామయ్య సమక్షంలో ఏఐటీయూసీలో చేరారు. ఈ కార్యక్రమంలో సింగరేణి కాలరీస్ వర్కర్స్ యూనియన్ డిప్యూటీ ప్రధాన కార్యదర్శి కె వీరభద్రయ్య, బ్రాంచ్ కార్యదర్శి, బాజీ సైదా, ఉప కార్యదర్శి మోత్కూరి కొమురయ్య, నాయకులు కొట్టే కిషన్ రావు, మురళీ చౌదరి, మోహన్‌రెడ్డి, సదానందం, అఫ్రోజ్ ఖాన్, తౌటం మల్లేష్, అంబాల రవి, రామోజీ, పాల్గొన్నారు.

నియోజకవర్గ అభివృద్ధిపై బీఆర్ఎస్‌తో చర్చకు సిద్ధం

- కాంగ్రెస్ నియోజకవర్గ ఇన్‌ఛార్జి శ్యామ్ నాయక్



నవతెలంగాణ-ఆసిఫాబాద్

ఆసిఫాబాద్ నియోజకవర్గంలో గత పది సంవత్సరాల్లో జరిగిన అభివృద్ధిపై ప్రతిపక్ష నాయకులతో చర్చకు సిద్ధమని ఇప్పటివరకు మంజూరైన అభివృద్ధి నిధుల ఖర్చుపై త్వరలో జిల్లా ఇన్‌ఛార్జి మంత్రి నియామకం తర్వాత పూర్తిస్థాయి విచారణ జరిపిస్తామని నియోజకవర్గ ఇన్‌ఛార్జి శ్యాం నాయక్ తెలిపారు. జిల్లా కేంద్రంలోని తన నివాసంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ 10 సంవత్సరాల్లో మౌలిక వసతులు కల్పించడంలో బీఆర్ఎస్ విఫలమైందన్నారు. నియోజకవర్గ ప్రజలు చాలా అమాయకులని వారిని మరోసారి మోసం చేసే విధంగా సాధ్యం కానీ హామీలు ఇచ్చారని ఆరోపించారు. ఎన్నికలకు ఒక రోజు ముందు మద్యం, డబ్బు పంపిణీతో ఓటర్లను తారుమారు చేశారని ఆరోపించారు. ఇది గెలుపుగా తాను భావించడం లేదని ఎద్దేవా చేశారు. అధికార ధన బలంతో కార్యకర్తలను బెదిరించి ప్రలోభాలు పెట్టి కేసులు పెట్టి బెదిరించారని అయిన వారు వెనక్కి తగ్గలేదన్నారు. తనకు టికెట్ కేటాయింపు కొంత ఆలస్యమైనప్పటికీ కార్యకర్తలు అతి తక్కువ కాలంలో తమ చెమటోడ్చి గెలుపు కోసం ప్రయత్నం చేశారని అయినప్పటికీ గెలుపు సాధ్యం కాలేదని వారి కృషికి వారందరికీ కృతజ్ఞతలు తెలిపారు. తాను ఓడిపోయినప్పటికీ మంచి ఆదరణ ఓటర్ల నుంచి లభించిందని 60000 పైగా ఓట్లు సాధించడానికి సంతోషంగా ఉందన్నారు. ఎన్నికల్లో గెలుపోటములు సహజమని నియోజకవర్గ ప్రజలు ఇచ్చిన ఓట్లు తనకు ఆత్మస్థైర్యాన్ని నింపిందన్నారు. నాయకుడిగా నియోజకవర్గంలో ప్రతి ఒక్కరికి అందుబాటులో ఉంటూ అధికార పార్టీ పథకాలను ప్రజల్లోకి తీసుకు వెళ్లే విధంగా అహర్నిశలు కృషి చేస్తానని తెలిపారు. ఎన్నికల సమయంలో పార్టీ మేనిఫెస్టో చెప్పిన విధంగా రెండు గ్యారెంటీలు శనివారం ప్రారంభం అవుతున్నాయన్నారు. మరి కొద్ది రోజుల్లో ఇచ్చిన 6 గ్యారంటీలు పకడ్బందీగా అమలు చేస్తామని ఆశ భావం వ్యక్తం చేశారు. ఈ సమావేశంలో ఎన్ఎస్‌యూఐ జిల్లా అధ్యక్షుడు మహమ్మద్ ఆసిఫ్, జిల్లా నాయకులు మంగ, శ్రావణ్, లోకేష్, మురళి, మల్లికార్జున్ పాల్గొన్నారు.

గ్యాస్‌కు కేవైసీ తప్పనిసరి

నవతెలంగాణ-బెజ్జూరు

గ్యాస్ వినియోగదారులకు ఈ నెల లెక్కలను పక్కాగా ఉంచడానికి ప్రభుత్వం చర్యలు తీసుకుంది. ఇందులో భాగంగా గ్యాస్ ఏజెన్సీలకు ఆదేశాలు జారీ చేసింది. గ్యాస్ కనెక్షన్ తీసుకున్న వినియోగదారుని కేవైసీ తప్పకుండా చేయాలని ఆయా ఏజెన్సీలకు ఆదేశాలు జారీ చేయడంతో సంబంధిత అధికారులు గ్యాస్ కనెక్షన్ తీసుకున్న వినియోగదారులు తప్పకుండా కేవైసీ చేసుకోవాలని సూచించారు. దీంతో ఆయా గ్యాస్ ఏజెన్సీల వద్ద వినియోగదారులు బారులుతీరి కనబడుతున్నారు. కేవైసీకి ఇంకా నెల రోజులు మాత్రమే సమయం ఉండడంతో గ్యాస్ ఏజెన్సీల వద్ద క్యూలో నిలబడి మరీ కేవైసీ చేసుకుంటున్నారు. గ్యాస్ కనెక్షన్‌ను ఆధార్‌తో అనుసంధానం చేస్తూ కేవైసీ పూర్తిచేస్తుండడంతో ఒకరికి ఎన్ని గ్యాస్ కనెక్షన్లు ఉన్నాయో, లేవో లెక్క తేలనుంది. దీంతో అక్రమ గ్యాస్ కనెక్షన్లు రద్దు కావడంతో ప్రభుత్వానికి ఆదా చేకూరనుంది. నూతన ప్రభుత్వం గ్యాస్ కనెక్షన్‌కు రూ.500 మాత్రమే తీసుకుంటామని ఎన్నికల్లో హామీ ఇవ్వడంతో గ్యాస్ వినియోగదారులు కేవైసీ వైపు మొగ్గు చూపుతున్నారు. కేవైసీ పూర్తయితే ఒక



గ్యాస్ కనెక్షన్ కుటుంబంలో ఒకరికి ఉండడం సబ్సిడీ సక్రమంగా రావడానికి వీలుకలుగుతుందని పలువురు అంటున్నారు. బెజ్జూరులో భారత్ గ్యాస్ కార్యాలయం వద్ద మహిళలు కేవైసీ కోసం వస్తున్నారు.

నవెదరి గ్రామస్తుల రాస్తారోకో

నవతెలంగాణ-వాంకిడి

మండలంలోని నవెదరి గ్రామానికి చెందిన గ్రామస్తులు రోడ్డుకు మరమ్మత్తులు చేయాలని శనివారం రాస్తారోకో నిర్వహించారు. డీబీఎల్ కంపెనీ ద్వారా నిర్వహిస్తున్న పనులకు ప్రతిరోజు ఈ రోడ్డు గుండా టన్నుల కొద్ది కంకర తరలించడంతో రోడ్డంతా గుంతలమయమై రాకపోకలకు ఇబ్బందులు కలుగుతున్నాయని గ్రామస్తులు ఆవేధన వ్యక్తం చేశారు. గతంలో కూడా డీబీఎల్ కంపెనీ రోడ్డుకు మరమ్మత్తులు చేస్తామని హామీ ఇచ్చినా నేటి వరకు పనులు పూర్తిచేయలేదన్నారు. దీంతో రాస్తారోకో నిర్వహించడంతో డీబీఎల్ కంపెనీ వారు రోడ్డుకు మరమ్మత్తులు చేస్తామని హామీ ఇవ్వడంతో గ్రామస్తులు రాస్తారోకో విరమించారు.

కొనసాగుతున్న కంకాలమ్మ జాతర



నవతెలంగాణ-కౌటాల

మండలకేంద్రంలోని కంకాలమ్మ గుట్టపై స్వయంభుగా వెలిసిన శ్రీ కేతేశ్వర, కంకాలమ్మ జాతర రెండో రోజు కొనసాగింది. ఆలయ వ్యవస్థాపక చైర్మన్ సుల్వ కనకయ్య, కళ్యాణి ఆధ్వర్యంలో శనివారం హోమం నిర్వహించగా పలువురు హోమంలో పాల్గొని అనంతరం అమ్మవారిని దర్శించుకున్నారు. తెలంగాణ రాష్ట్రంలోనే స్వయంభుగా వెలిసిన అమ్మవారు కాబట్టి తెలంగాణ, ఆంధ్రప్రదేశ్, మహారాష్ట్ర, చత్తీస్‌ఘడ్ రాష్ట్రాల నుంచి ఆదివారం చివరి రోజు నిర్వహించే జాతరకు భారీగా భక్తులు తరలిరానున్నట్టు ఆయన పేర్కొన్నారు. కౌటాల సీఐ సాదిక్‌పాషా భక్తుల సౌకర్యార్థమై అన్ని ఏర్పాట్లను పరిశీలించి భారీ బందోబస్తు నిర్వహించనున్నట్టు పేర్కొన్నారు. ఇతర రాష్ట్రాల నుంచి వచ్చే భక్తులకు సిర్పూర్ రైల్వేస్టేషన్ నుండి కొమురంభీం ఆసిఫాబాద్ డిపో నుంచి నాలుగు ప్రత్యేక ఆర్టీసీ బస్సులను నడుపనున్నట్టు ఆయన తెలిపారు. అనంతరం భక్తులకు అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమంలో ఆలయ కమిటీ సభ్యులు, భక్తులు పాల్గొన్నారు.

ఉద్యమకారుల గుర్తింపు అభినందనీయం

నవతెలంగాణ-కాగజ్‌నగర్

తెలంగాణా రాష్ట్ర సాధన ఉద్యమంలో పాల్గొన్న ఉద్యమకారులను గుర్తించి ముఖ్యమంత్రి రేవంతరెడ్డి ప్రమాణ స్వీకారోత్సవానికి ఆహ్వానాలు పంపించడం అభినందనీయమని 1969 తెలంగాణ ఉద్యమకారుల సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షులు మార్త సత్యనారాయణ శనివారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. త్వరలో ముఖ్యమంత్రి రేవంతరెడ్డిని కలిసి ఉద్యమకారుల జాబితా అందజేస్తామని తెలిపారు.

కైరిట్ గ్రామంలో వైద్యశిబిరం

నవతెలంగాణ-వాంకిడి

మండలంలోని కైరిట్ గ్రామంలో గల టీడబ్ల్యూటీ పాఠశాలలో శనివారం హెచ్ఈఓ రవిదాస్ ఆధ్వర్యంలో వైద్యశిబిరం నిర్వహించారు. ఈ సందర్భంగా హెచ్ఈఓ రవిదాస్ విద్యార్థులకు వ్యక్తిగత పరిశుభ్రత గురించి సలహాలు, సూచనలు చేశారు. అనంతరం విద్యార్థులకు వైద్య పరీక్షలు నిర్వహించి ఉచితంగా మందులు పంపిణీ చేశారు. కార్యక్రమంలో పాఠశాల ఉపాధ్యాయుడు మనోహర్, ఆశావర్కర్లు, అంగన్‌వాడీ కార్యకర్తలు పాల్గొన్నారు.

ఉచిత బస్సులో మహిళల ప్రయాణం

నవతెలంగాణ-బెజ్జూరు

రాష్ట్ర ప్రభుత్వం శనివారం మధ్యాహ్నం 1:30 గంటలకు మహిళలకు ఉచిత బస్సు సౌకర్యాన్ని కల్పిస్తూ ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ఉచిత బస్సు ప్రయాణం ప్రారంభించడంతో శనివారం మండలంలోని మహిళలు బస్సు ప్రయాణాన్ని వినియోగించుకున్నారు. ముఖ్యమంత్రి ఉచిత బస్సు ప్రారంభించిన తర్వాత బారెగూడ, బెజ్జూరు మొదటి బస్సు రావడంతో దానిలో మహిళలు బస్సులో ప్రయాణించి ఆనందం వ్యక్తం చేశారు. ఇక నుంచి తెలంగాణ వ్యాప్తంగా మహిళలకు ఉచిత బస్సు సౌకర్యం కలుగనుండడంతో మహిళలు హర్షం వ్యక్తం చేస్తున్నారు. మొదటిసారి బస్సులో ప్రయాణించిన అనుభూతిని వ్యక్తం చేస్తున్నారు.

విద్యార్థుల తల్లిదండ్రులకు క్రీడా పోటీలు



నవతెలంగాణ-జన్నారం

మండల కేంద్రంలోని స్లేట్ హైస్కూల్‌లో చదువుతున్న విద్యార్థిని విద్యార్థుల తల్లిదండ్రులకు ఆటల పోటీలను ఆ పాఠశాల యాజమాన్యం శనివారం నిర్వహించింది. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా ఎస్సై పి.సతీష్ హాజరై విద్యార్థుల తల్లిదండ్రులను ఉద్దేశించి మాట్లాడారు. ఆటలు శారీరక దారుణ్యంతో పాటు మానసికఉల్లాసాన్ని కలిగిస్తాయన్నారు. ఆటల వలన మనం రోజు చేసే పనులలో ఉత్సాహంగా పాల్గొనడం జరుగుతుందన్నరు. విద్యార్థుల తల్లిదండ్రులు విద్యార్థులను ఇంటి వద్ద క్రమశిక్షణగా పెంచాలన్నారు. ఈ కార్యక్రమంలో స్లేట్ హైస్కూల్ ఫౌండర్ సుభాష్‌రెడ్డి, స్లేట్ హైస్కూల్ కరస్పాండెంట్ ఏనుగు శ్రీకాంత్‌రెడ్డి, వైస్ ప్రిన్సిపల్ పూజ అడ్మినిస్ట్రేటర్ ఏనుగు రజిత, ఉపాధ్యాయులు కృష్ణ సంతోష్, నగేష్, కిరణ్ పాల్గొన్నారు.

మండలానికి బస్సు సౌకర్యం కల్పించాలి

నవతెలంగాణ-భీమిని

మండలానికి బస్ సౌకర్యం కల్పించాలని ఆర్టీసీ ఆర్ఎంకు శనివారం కాంగ్రెస్ నాయకులు వినతి పత్రం అందజేశారు. బస్ సౌకర్యం లేకపోవడంతో ప్రజలు ఎదుర్కొంటున్న ఇబ్బందులను వివరించారు. ఈ కార్యక్రమంలో బీట్టుర్పలి కాంగ్రెస్ కార్యకర్తలు పోతురాజుల శ్రావణ్ కుమార్, రామటెంకి దశరథ్, యటకారి రవి, యటకారి రాజు పాల్గొన్నారు

నవతెలంగాణ

మంచిర్యాల

ఆదివారం | డిసెంబర్ 10, 2023 | www.navatelangana.com

పని ప్రదేశాల్లో మహిళల భద్రతపై సెమినార్

నవతెలంగాణ - రెబ్బెన



గోలేటి జీఎం కార్యాలయం కాన్ఫరెన్స్ హాలులో శనివారం పని ప్రదేశాల్లో మహిళా ఉద్యోగుల భద్రతపై అవగాహన సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా సీనియర్ అకౌంట్ ఆఫీసర్ సుద్దాల సౌమ్య పని ప్రదేశాలలో మహిళలపై లైంగిక వేధింపుల చట్టంపై అవగాహన కల్పించారు. కార్యాలయాల్లో మహిళలను లైంగిక వేధింపుల నుండి రక్షణ కల్పించడానికి 2013, డిసెంబర్ 9న చట్టం అమల్లోకి వచ్చిందన్నారు. మహిళలను వేధింపులకు గురిచేసే వారిని ఎలా ఎదుర్కోవాలో వివరించారు. మహిళా ఉద్యోగులు సూచనలు, సలహాలు అడిగి తెలుసుకున్నారు.

కార్మికుల హక్కుల సాధన టీబీజీకేఎస్‌తోనే సాధ్యం

నవతెలంగాణ - కాసిపేట



కార్మికుల హక్కుల సాధన టీబీజీకేఎస్‌తోనే సాధ్యమని టీబీజీకేఎస్ ప్రధాన కార్యదర్శి మిర్యాల రాజిరెడ్డి పేర్కొన్నారు. శనివారం మందమర్రి ఏరియాలోని కాసిపేట గనిపై టీబీజీకేఎస్ గేట్ మీటింగ్ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఇప్పటి వరకు కార్మికులకు అనేక హక్కులను సాధించామని, కార్మికుల పక్షాన ఉండే టీబీజీకేఎస్‌కు కార్మికుల మద్దతు ఇవ్వాలని కోరారు. వచ్చే సింగరేణి యూనియన్ ఎన్నికల్లో అత్యధిక మెజార్టీతో గెలిపించాలని కోరారు. ఈ కార్యక్రమంలో టీబీజీకేఎస్ నాయకులు సంపత్, రాజన్న, శ్రీనివాస్, మేడ సమ్మయ్య పాల్గొన్నారు.

ఘనంగా సోనియా గాంధీ జన్మదిన వేడుకలు

నవతెలంగాణ-నస్పూర్

కాంగ్రెస్ అగ్ర నాయకురాలు సోనియా గాంధీ 77వ జన్మదిన వేడుకలను డీసీసీ అధ్యక్షురాలు కొక్కిరల సురేఖ ఆధ్వర్యంలో శనివారం మున్సిపాలిటీలోని సీసీసీ కార్నర్ వద్ద ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ సోనియా గాంధీ జన్మదిన సందర్భంగా 2009లో తెలంగాణ రాష్ట్ర ఏర్పాటుకు ఆమోదం తెలిపిందని, ఈరోజు రేవంత్ రెడ్డి ముఖ్యమంత్రి హయాంలో మహాలక్ష్మి పేరిట తెలంగాణ మహిళలకు ఉచిత బస్సు ప్రయాణం ప్రారంభించడం హర్షించదగ్గ విషయమని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ ఫ్లోర్ లీడర్, కౌన్సిలర్ సురిమిల్ల వేణు, మండల మహిళా అధ్యక్షురాలు,12 వార్డు కౌన్సిలర్ బొద్దున సంధ్యారాణి-రామ్మూర్తి, జిల్లా మైనార్టీ అధ్యక్షులు ఖలీద్, జిల్లా యూత్ అధ్యక్షుడు సంపత్‌రెడ్డి, డీసీసీ జెనరల్ సెక్రటరీ భూపతి శ్రీనివాస్ పాల్గొన్నారు.

మందమర్రి : సోనియా గాంధీ జన్మదిన వేడుకల్ని యూత్ కాంగ్రెస్ వారియర్స్ ఘనంగా నిర్వహించారు. సోనియా గాంధీ జన్మదినాన్ని పురస్కరించుకొని మందమర్రి కాంగ్రెస్ యూత్ వారియర్స్ ఆధ్వర్యంలో శనివారం పట్టణంలోని భగత్ సింగ్ నగర్ కూడలి వద్ద కేక్ కట్ చేసి శుభాకాంక్షలు తెలిపారు. రాయబారపు కిరణ్ మాట్లాడుతూ తెలంగాణ ఇచ్చిన తల్లి సోనియా తెలంగాణలో కాంగ్రెస్ ప్రభుత్వం వచ్చాక మొదటిసారి సోనియా గాంధీ పుట్టిన రోజును జరుపుకోవడం చాలా ఆనందంగా ఉందన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం 6 గ్యారంటీ పథకాలలో భాగంగా రెండు గ్యారెంటీలను సోనియా గాంధీ పుట్టినరోజు నుండే అమలులోకి తీసుకురావడం సంతోషంగా ఉందన్నారు. మొదటిగా మహాలక్ష్మి పథకం కింద మహిళలకు రాష్ట్రంలో ఉచిత ప్రయాణం, రెండోది చేయూత పథకం కింద రాజీవ్ ఆరోగ్యశ్రీ భీమా10 లక్షలు పెంచుతూ అమల్లోకి తేవడం జరిగిందని తెలిపారు. పేద మధ్య తరగతి అనే తేడా లేకుండా ప్రతి ఒక్కరు కాంగ్రెస్ పథకాలను ఉపయోగించుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో యూత్ కాంగ్రెస్ వారియర్స్ సుజిత్, సాగర్, అన్వేష్, విజయ్, రవికిరణ్, సాత్విక్ తదితరులు పాల్గొన్నారు.

జన్నారం : ఏఐసీసీ మాజీ అధ్యక్షురాలు సోనియా గాంధీ జన్మదిన వేడుకలను కాంగ్రెస్ నాయకులు శనివారం ఘనంగా నిర్వహించారు. ముందుగా మండల అధ్యక్షుడు ముజాఫర్ అలీఖాన్ పార్టీ కార్యాలయంలో పార్టీ నాయకులతో కేక్ కట్ చేసి, సంబరాలు జరుపుకున్నారు. అనంతరం పట్టణ అధ్యక్షుడు దూమల్ల రమేష్ ఆధ్వర్యంలో కేక్ కట్ చేసి మిఠాయిలు తినిపించుకున్నారు. అనంతరం ప్రభుత్వ ఆస్పత్రిలోని రోగులకు పండ్లను బ్రెడ్ ప్యాకెట్లను పంపిణీ చేశారు. కార్యక్రమంలో మండల ప్రధాన కార్యదర్శి మాణిక్యం, గుర్రం మోహన్ రెడ్డి పసియుల్లా అల్లం వెంకటరాజం నందు నాయక్, మామిడిపల్లి ఇంద్రయ్య, ఎంపీటీసీల ఫోరం జిల్లా అధ్యక్షుడు మహమ్మద్ రియాజుద్దీన్ లకావత్ తిరుపతి, ముత్యం రాజన్న, మత్స్య శంకరయ్య, పాత బాలరాజు షాకీర్ ముజ్జు, రాజన్న, ఎన్ఎస్‌యూఐ రాష్ట్ర కార్యదర్శి సోహెల్‌షా, అజ్మత్ పాల్గొన్నారు.

వేమనపల్లి : నీల్వాయి గ్రామ పంచాయితిలో మాజీ జడ్పీటీసీ నీల్వాయి ఎంపీటీసీ రుద్రభట్ల సంతోష్ కుమార్ ఆదేశాల కాంగ్రెస్ మండల అధ్యక్షుడు సయ్యద్ సాబీర్ అలీ, గ్రామ సర్పంచ్ గాలి మధు ఆధ్వర్యంలో భారత జాతీయ కాంగ్రెస్ మాజీ అధ్యక్షురాలు సోనియా గాంధీ పుట్టిన రోజు వేడుకను ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో మండల కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

తాండూర్ : బెల్లంపల్లి కాంగ్రెస్ కార్యాలయంలో శనివారం సోనియాగాంధీ జయంతి వేడుకలు ఘనంగా నిర్వహించారు. ముందుగా కేక్ కట్ చేసి టపాసులు పేల్చి సంబరాలు చేసుకున్నారు. కాంగ్రెస్ నాయకులు మాట్లాడుతూ తెలంగాణ నాలుగు కోట్ల మంది ఆకాంక్షను గౌరవించి తెలంగాణ ఇచ్చిన సోనియా గాంధీకి రాష్ట్ర ప్రజలందరూ బ్రహ్మరథం పట్టారని తెలిపారు. అసెంబ్లీలో ప్రమాణ స్వీకారం చేసిన తెలంగాణ ఎమ్మెల్యేల అందరికీ హృదయపూర్వకంగా అభినందనలు తెలియజేశారు. కార్యక్రమంలో మాజీ మున్సిపల్ ఛైర్మన్ మత్తమారి సూరిబాబు, మాజీ మార్కెట్ కమిటీ ఛైర్మన్ కారుకూరి రామచందర్, టీపీసీసీ ప్రచార కమిటీ జాయింట్ కన్వీనర్ నాతరి స్వామి, రాష్ట్ర మహిళా కార్యదర్శి రోడ్డ శారద, టీపీసీసీ సభ్యుడు చిలుముల శంకర్ పాల్గొన్నారు.



నస్పూర్



మందమర్రి



జన్నారం



వేమనపల్లి

ఆటో డ్రైవర్లకు ప్రభుత్వం న్యాయం చేయాలి



నవతెలంగాణ-జన్నారం

ఆటో డ్రైవర్లకు కాంగ్రెస్ ప్రభుత్వం న్యాయం చేయాలని ఆటో యూనియన్ ఓనర్లు, డ్రైవర్ల సంఘం అధ్యక్షుడు నసీరుద్దీన్ కోరారు. శనివారం మండల కేంద్రంలో బస్టాండ్ ఆవరణంలో నిరసన తెలిపారు. ఆటోలను నమ్ముకుని తాము జీవనోపాధిని పొందుతున్నామని, బస్సులలో మహిళలకు ఉచిత ప్రయాణంతో తాము ఉపాధిని కోల్పోయే అవకాశం ఉందన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం న్యాయం చేయాలని వారు కోరారు. మేము కూడా కాంగ్రెస్ ప్రభుత్వం రావాలని ఆ పార్టీకి ఓటు వేశామని కానీ ప్రభుత్వం ఇలా చేయడం తగదన్నారు. ఆటోలు జీవులు టాటా ఏసీలు వీటిపై ఎంతోమంది బ్రతుకుతున్నారన్నారు. వారికి ఎలాంటి ఉపాధి చూపకుండా ఇలా ఉచిత బస్సు ప్రయాణాలు పెట్టి తమ కుటుంబాలను రోడ్డుకు ఈడ్చడం సరికాదన్నారు. తమ కుటుంబాలు రోడ్డున పడతాయన్నారు. వెంటనే ప్రభుత్వం స్పందించి తమకు జీవనోపాధి కల్పించాలని డిమాండ్ చేశారు. తమ బాధలను నిరసన తెలుపడానికి బస్టాండ్‌లోకి ఆటో యూనియన్ నాయకులంతా వెళితే అక్కడికి వచ్చిన కాంగ్రెస్ నాయకులు తమను దూషించడం సరికాదన్నారు.

సోనియా గాంధీ జన్మదిన వేడుకలు



కాసిపేట

నవతెలంగాణ - కాసిపేట

మండల కేంద్రంలో కాంగ్రెస్ యువజన నాయకులు, యాదవ సంఘం జిల్లా యూత్ అధ్యక్షులు పుర్ర కుమారస్వామి యాదవ్ ఆధ్వర్యంలో శనివారం సోనియా గాంధీ జన్మదిన వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా కేక్ కట్ చేసి సంబరాలు నిర్వహించారు. అనంతరం యువజన కాంగ్రెస్ నాయకులు పుర్ర కుమార స్వామి యాదవ్ మాట్లాడుతూ మహిళలకు ప్రవేశపెట్టిన ఉచిత బస్సు ప్రయాణం, రూ.500కు గ్యాస్ సిలిండర్, 200 యూనిట్ల ఉచిత విద్యుత్ మహిళా లోకానికి ఎంతో లాభదాయకమన్నారు. సోనియా గాంధీ పుట్టినరోజు సందర్భంగా ప్రవేశపెట్టిన సీఎం రేవంత్‌రెడ్డి, ఎమ్మెల్యే గడ్డం వినోద్‌కు ప్రత్యేక ధన్యవాదాలు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో మాజీ సహకార చైర్మన్ పుస్కూరి వంశీ కృష్ణారావు, కాంగ్రెస్ నాయకులు దారవేని రాజన్న, కో ఆప్షన్ సభ్యులు సిరాజ్‌ఖాన్, రేశవేని ఓదెలు, నర్సింగ్, సునీత, ముత్యంపల్లి అధ్యక్షులు మైదం రమేష్, ఎస్సీ సెల్ ప్రెసిడెంట్ గోలేటి స్వామి, మేడ రాంచందర్, పుర్ర పోషం, మల్లెత్తుల రాజేశం, రేశవేణి స్వామి, భిక్షపతి, సమీల్ కుమార్, నలిగేటి నరేష్, బోయిని మహేష్, బోయిని శ్రీనివాస్ పాల్గొన్నారు.

రెబ్బెన : కాంగ్రెస్ అగ్రనేత సోనియాగాంధీ పుట్టినరోజు వేడుకలను మండలంలోని బస్టాండ్ వద్ద ఘనంగా జరుపుకున్నారు. ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి సోనియాగాంధీ పుట్టినరోజు సందర్భంగా ఆరు గ్యారెంటీలలో రెండు గ్యారెంటీలు మహిళలకు ఉచిత బస్సు ప్రయాణం, ఆరోగ్యశ్రీ పథకం ద్వారా రూ.10 లక్షల కార్పొరేట్ వైద్యం నేటి నుండి అమలు చేయడం ద్వారా కాంగ్రెస్ ప్రభుత్వం పేదలకు సేవ చేయడంలో ముందుంటుందని నాయకులు తెలిపారు. కార్యక్రమంలో మండల అధ్యక్షుడు ఎల్ రమేష్, మాజీ జెడ్పీటీసీ దుర్గం సోమయ్య, బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు దేవాజీ, వనమాల మురళీ, మోడెం చిరంజీవిగౌడ్, లెండుగురె గంటుమేర, సునామి పద్మ ముంజం రవీందర్, మోర్లె తులసీరాం, సీహెచ్ ఆత్మారావు, ఆజ్మీరా అశోక్, మోడెం నర్సాగౌడ్, రాజాగౌడ్, ఉమేష్, సతీష్ జైస్వాల్, రాజు జైస్వాల్ పాల్గొన్నారు.

ఘనంగా సోనియా గాంధీ జన్మదిన వేడుకలు

నవతెలంగాణ-ముత్తారం

కాంగ్రెస్ అగ్ర నాయకురాలు సోనియాగాంధీ జన్మదిన వేడు కలను ముత్తారం మండల కాంగ్రెస్ పార్టీ నాయకులు, మ హిళా కాంగ్రెస్ పార్టీ నాయకు రాళ్ల ఆధ్వర్యంలో శనివారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా కాంగ్రెస్ పార్టీ వాగ్దానం చేసిన 6 గ్యారంటీల అమలులో భాగంగా ఆర్టీసీలో మహిళలకు ఉచిత బస్సు ప్రయాణాన్ని పురస్కరించుకొని ఆర్టీసీ బస్సులో ప్రయాణిస్తున్న మహిళల చేత ముత్తారం మండల కాంగ్రెస్ పార్టీ నాయకులు కేక్ కటింగ్ చేసి కాంగ్రెస్ పార్టీ ఇచ్చిన మాట నిలబెట్టుకుంటుందని తెలిపారు. కార్యక్రమంలో కాంగ్రెస్ జిల్లా పార్టీ ఉపాధ్యక్షుడు చొప్పరి సదానందం మండల పార్టీ అధ్యక్షుడు దొడ్డ బాలాజీ, మండల యువజన సంఘం అధ్యక్షుడు బియ్యాని శివకుమార్, అడవీ శ్రీరాంపూర్ ఎంపీటీసీ దొడ్డ గీతారాణి పాల్గొన్నారు.

మంత్రి శ్రీధర్‌బాబును కలిసిన కాంగ్రెస్ నాయకులు

నవతెలంగాణ-ముత్తారం

రాష్ట్ర ఐటీ, పరిశ్రమల, శాసన సభ వ్యవహార మంత్రిగా నియమితులైన మంథని ఎమ్మెల్యే దుద్దిళ్ల శ్రీధర్‌బా బును ముత్తారం మండలం ఖమ్మం పల్లి గ్రామ కాంగ్రెస్ నాయకులు హైదరా బాద్‌లో శనివారం మర్యాద పూర్వ కంగా కలిశారు. ఈ సందర్భంగా ఆయనకు శాలువా కప్పి ఘనంగా సన్మానించారు. మంత్రిని కలిసిన వారిలో ఓబీసీ మండల అధ్యక్షుడు అల్లం కుమారస్వామి, గ్రామ శాఖ అధ్యక్షుడు బగ్గని మొగిలిలు ఉన్నారు.

ఆటో డ్రైవర్స్ ఆధ్వర్యంలో సోనియా గాంధీ జన్మదిన వేడుకలు

నవతెలంగాణ-మంథని

తెలంగాణ ఇచ్చిన దేవత సోనియా గాంధీ జన్మదిన వేడుకలను మంథని మున్సిపల్ ఆటో డ్రైవర్స్ ఆధ్వర్యంలో కేక్ కట్ చేసి, బాణాసంచా కాల్చి, సంబరాలు జరుపుకున్నారు. సోనియా గాంధీ తెలంగాణ రాష్ట్ర ఆవిర్భావ ఏర్పాటు కృషికి చేసిన సేవలను వారు కొనియాడారు. ఈ కార్యక్రమంలో మంథని మున్సిపల్ కౌన్సిలర్ పెల్లి రమా సురేష్ రెడ్డి,పట్టణ అధ్యక్షుడు పోలు శివ, మైనార్టీ అధ్యక్షుడు అబ్దుల్ అలీమ్, పట్టణ అధ్యక్షుడు ఎండీ అజాజ్‌లు పాల్గొన్నారు.

విద్యుద్ఘాతంతో రైతు మృతి



నవతెలంగాణ-దిలావర్‌పూర్

పందుల బెడదను తట్టుకోవడానికి పంట పొలం చుట్టూ ఏర్పాటు చేసిన విద్యుత్ కంచె తగిలిన రైతు మృతి చెందిన ఘటన నర్సాపూర్(జి) మండలం గొల్లమాడ గ్రామంలో చోటుచేసుకుంది. ఏఎస్ఐ తెలిపిన వివరాల ప్రకారం..రైతు లక్ష్మయ్య(54) తన పంట పొలాన్ని పందుల బెడద నుండి కాపాడడానికి పొలం చుట్టూ విద్యుత్ తీగలు అమర్చాడు. ఎప్పటిలాగే రైతు శనివారం పొలానికి వెళ్లాడు. రైతు ఆకస్మాత్తుగా విద్యుత్ తీగలపై పడి అక్కడికక్కడే మృతి చెందాడు. తండ్రి పొలానికి వెళ్లి ఇంకా తిరిగి రాకపోయేసరికి కుమారుడు పక్క పొలంలో పనిచేస్తున్న కళ్యాణ్‌కర్ వెంకట్‌రావుకు ఫోన్ చేశాడు. అతను పొలంలోకి వెళ్లి గమనించగా విద్యుద్ఘాతానికి గురై తీగలపై పడి ఉన్న విషయాన్ని కుటుంబీకులకు తెలియజేశాడు. హుటాహుటిన ఘటన స్థలానికి చేరుకున్న కుటుంబీకుల రోదనలు మిన్నంటాయి. మృతునికి భార్య కాపెల్లి రుక్మాబాయి, ఇద్దరు కుమారులు, ఇద్దరు కుమార్తెలు ఉన్నారు. కేసు దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

సింగరేణి బొగ్గు గనుల ప్రయివేటీకరణను అడ్డుకుంటాం

నవతెలంగాణ-గోదావరిఖని

సింగరేణి బొగ్గు గనుల ప్రైవేటీకరణను అడ్డుకుంటామని ఐఎన్‌టీయూసీ సెక్రటరీ జనరల్ జనక్ ప్రసాద్ అన్నారు. సింగరేణి ఆర్జీ-1 పరిధిలోని జీడీకే 11వ గనిపై యూనియన్ ఆర్జీ-1 ఉపాధ్యక్షుడు సదానందం ఆధ్వర్యంలో ఫిట్ సెక్రటరీ గాదె సంపత్ అధ్యక్షతన శనివారం ఏర్పాటు చేసిన గేట్ మీటింగ్‌లో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొని మాట్లాడారు. సింగరేణి మనుగడ సాధించాలంటే ఈనెల 27న జరిగే సింగరేణి గుర్తింపు సంఘం ఎన్నికల్లో గడియారం గుర్తుపై ఓటు వేసి భారీ మెజారిటీతో కార్మికుల పక్షాన పోరాడే సంఘం ఐఎన్‌టీయూసీని గెలిపించాలని కోరారు. అదే విధంగా కార్మికుల సొంత ఇంటి కల నెరవేరలన్నా, పెర్క్స్ మీద ఇన్ కమ్ టాక్స్ మాఫీ కావాలన్న, కొత్త బొగ్గు గనుల ప్రారంభించి నూతన ఉద్యోగ అవకాశాలు కల్పించాలన్న, కార్మికుల పక్షాన నిరంతరం పోరాడే సంఘం ఐఎన్‌టీయూసీకి అవకాశం ఇవ్వాలని కోరారు. కార్యక్రమంలో సెంట్రల్ సీనియర్ వైస్ ప్రెసిడెంట్‌లు నరసింహారెడ్డి, ధర్మపురి, సెంట్రల్ క్యాంపెనింగ్ చైర్మన్ వికాస్ కుమార్ యాదవ్, సెంట్రల్ డెప్యూటీ జనరల్ సెక్రెటరీలు దేవులపల్లి రాజేందర్, అరేపల్లి శ్రీనివాస్, మైనింగ్ స్టాఫ్ ఇన్‌ఛార్జ్ సమయ్య యాదవ్ తదితరులున్నారు.

సింగరేణి కార్మికుడి యూనిఫాంతో ఎమ్మెల్యే ప్రమాణ స్వీకారం

నవతెలంగాణ-గోదావరిఖని

హైదరాబాద్‌లోని అసెంబ్లీలో శనివారం జరిగిన ఎమ్మెల్యేల ప్రమాణ స్వీకారంలో రామ గుండం నియోజ కవర్గ ఎమ్మెల్యే మక్కాన్ సింగ్ రాజ్ ఠాకూర్ సింగరేణి కార్మికుని గా యూనిఫాం ధరించి, తల కు హెల్మెట్, తట్ట చెమ్మస్‌తో అసెంబ్లీలో ప్రమాణ స్వీకా రం చేశారు. అంతకు ముందు అసెంబ్లీ మీడియా పాయింట్ వద్ద మాట్లాడుతూ.. సింగరేణి కార్మికుల సమస్యలను పరిష్కరిస్తానని, వారికి రక్షణగా ఉంటానని అన్నారు. రామగుండం నియోజకవర్గ ప్రాంతాన్ని అభివద్ధి చేసి చూపిస్తానని తెలిపారు.

గిరిజన గ్రామాలకు బస్సు సౌకర్యం కల్పించాలి

నవతెలంగాణ - కాసిపేట



మండలంలోని ఆదివాసీ గిరిజన గ్రామాలకు బస్సు సౌకర్యం కల్పించాలని ఆదివాసీ గిరిజనులు డిమాండ్ చేశారు. శనివారం మండలంలోని గట్రావ్‌పల్లి గ్రామ పంచాయతీలో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆదివాసీ గిరిజన నాయకులు మాట్లాడారు. మండలంలోని ఆదివాసీ గిరిజన గ్రామాలను కలుపుతూ మంచిర్యాల నుంచి గట్రావ్‌పల్లి గ్రామం వరకు ఆర్టీసీ బస్సు సౌకర్యం ఉండగా ప్రస్తుతం బస్సు రావడం లేదన్నారు. నూతనంగా ఏర్పాటైన తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం ఆర్టీసీ బస్సులలో మహిళలకు ఉచిత ప్రయాణం ప్రారంభించడం ఆనందకరమని, కాని ఆదివాసీ గూడాలకు బస్సు సౌకర్యం లేకపోవడం బాధాకరమని పేర్కొన్నారు. దీనిపై వెంటనే స్థానిక ప్రజాప్రతినిధులు, సంబంధిత అధికారులు స్పందించి ఆదివాసీ గ్రామాలకు బస్సు సౌకర్యం కల్పించాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఆదివాసీ సేనా ప్రధాన కార్యదర్శి సిడాం గణపతి, ఉపాధ్యక్షులు పెంద్రం ప్రభాకర్, నాయకులు సిడాం మోహన్, ఆడే సంపత్, సిడాం కృష్ణ, కుడిమెత రవీందర్, సిడాం రమేష్, కుడిమెత సావిత్రిబాయి, మంజులబాయి, భీంభాయి, కాసుబాయి పాల్గొన్నారు.

ఘనంగా సోనియా గాంధీ జన్మదిన వేడుకలు

నవతెలంగాణ-గోదావరిఖని టౌన్

సోనియాగాంధీ 77వ జన్మదిన వేడుకలను కాంగ్రెస్ పార్టీ ఆధ్వ ర్యంలో గోదావరిఖనిలో ఘనంగా నిర్వహించారు. సోనియా గాంధీ జన్మదినం సందర్భంగా కాంగ్రెస్ పార్టీ ఇచ్చిన హామీల మేరకు మహాలక్ష్మి పథకంలో మహిళలకు ఆర్టీసీ బస్సులో ఉచిత ప్రయాణం, రాజీవ్ ఆరోగ్య శ్రీ కింద 10లక్షల ఉచిత వైద్యం ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి అమలు చేయడం పట్ల హర్షం వ్యక్తం చేశారు. స్థానిక బస్టాండ్ వద్ద పట్టణ కాంగ్రెస్ అధ్యక్షుడు తిప్పారపు శ్రీనివాస్ ఆధ్వర్యంలో జరిగిన వేడుకల్లో ముఖ్య అతిథులుగా పీసీసీ నాయకులు కాల్వ లింగస్వామి, నగర కాంగ్రెస్ అధ్యక్షుడు బొంతల రాజేష్, కొలిపాక సుజాత పాల్గొని, సోనియా గాంధీ చిత్ర పటానికి పాలాభిషేకం చేశారు. కార్యక్రమంలో నాయకులు నాయిని ఓదేలు, కొప్పుల శంకర్, బొమ్మక రాజేష్, కొలిపాక మల్లయ్య, పత్తేపు రాజు, తిప్పారపు శ్రావణ్, రమేష్ యాదవ్‌తో తదితరులున్నారు.

సచ్ దేవా స్కూల్ ఆఫ్ ఎక్సలెన్స్‌లో సైన్స్ విజ్ఞాన ప్రదర్శన

నవతెలంగాణ-గోదావరిఖని టౌన్

ఎన్టీపీసీలోని సచ్ దేవా స్కూల్ ఆఫ్ ఎక్సలెన్స్‌లో శని వారం సైన్స్ అండ్ విజ్ఞాన శాస్త్ర ప్రదర్శన ఘనంగా నిర్వహించారు. ముఖ్య అతి థిగా ఎన్టీపీసీ జీఎం అలోక్ చంద్ర ఠాకూర్, హెచ్ ఆర్ హెడ్ బిజయ్‌కుమార్ సిక్దర్ హాజరుగా కాగా, ఈ సంద˘ర్భంగా వారికి ప్రిన్సి పాల్ జ్ఞాన్‌చంద్ ఘన స్వాగతం పలికారు.అనంతరం ముఖ్య అతిథులుగా జ్యోతి ప్రజల్వన చేసి కార్యక్రమాన్ని ప్రారంభించారు. విద్యార్థులు తయారు చేసిన వివిధ రకాలైన సైన్స్ మోడల్స్, అలాగే తెలుగు, హిందీ, ఇంగ్లీష్ మొదలైన సబ్జెక్ట్‌లో అనేక విజ్ఞాన విషయాలను తెలుపుతూ పరికరాలతోనూ ఉన్న వాటిని వివరాలను అడిగి తెలుసుకున్నారు.

వికలాంగులను విస్మరించిన కాంగ్రెస్ ప్రభుత్వం

నవతెలంగాణ-ముత్తారం

ఉచిత బస్ ప్రయాణంలో కాంగ్రెస్ ప్రభుత్వం వికలాంగులను విస్మరించిందని తెలంగాణ వికలాంగుల నెట్వర్క్ ఉమ్మడి కరీంనగర్ జిల్లా జనరల్ సెక్రెటరీ అనంతుల నాగరాజు, రాష్ట్ర కో ఆర్డనేటర్ బండి సత్యం, పెద్దపల్లి జిల్లా అధ్యక్షుడు గజలె సతీష్, గుగ్గిల్ల సువర్ణ, కరీంనగర్ జిల్లా అధ్యక్షుడు వెల్మ బాపు రెడ్డి,నిమ్మతి ఆశాలు, సతీష్, సరిత, రాజశేఖర్ రెడ్డి, టాంక్ జైదేవ్‌లు సంయుక్త ప్రకటనలో పేర్కొన్నారు. ఎన్నికల మ్యానిఫెస్టోలో ఇచ్చిన విధంగా దివ్యాంగులకు ఉచిత బస్ ప్రయాణం, 6000 పింఛన్ ఇస్తానని చెప్పి విస్మరించడం, దివ్యాంగురాలికి ఉద్యోగ భద్రత అని చెప్పి కాంట్రాక్ట్ పద్ధతిలో ఉద్యోగం ఇవ్వడం బాధాకరం, వికలాంగులు అంటేనే సామాజికంగా ఆర్థికంగా కుటుంబపరంగా వెనుకబడిన వారు అని,ముఖ్యంగా అన్ని వర్గాల వారి కంటే సమాజంలో అత్యంత వివక్షతకు గురవుతున్నారన్నారు. ప్రభుత్వం ఎలాంటి పథకం చేపట్టిన 5 శాతం తగ్గకుండా వికలాంగులకు బడ్జెట్, 4 శాతం ఉద్యోగ అవకాశాలు కేటాయించాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు.

మంథనిలో సోమవారం గోదావరి హారతి కార్యక్రమం

నవతెలంగాణ-మంథని

గత 12 సంవత్సరాలుగా కార్తీక మాసంలో మంథనిలో నిర్వహిస్తున్న గోదావరి మహా హారతి కార్యక్రమం సోమవారం 11వ తేదీన సాయంత్రం ఐదు గంటలకు మంథని గోదావరి వద్ద నిర్వహించనున్నట్టుగా గోదావరి హారతి రాష్ట్ర కో కన్వీనర్ క్యాతం వెంకటరమణ తెలిపారు. హారతి కార్యక్రమం కరపత్రాలను శనివారం మంథనిలోని లక్ష్మీనారాయణ స్వామి దేవాలయం వద్ద ఆవిష్కరించారు. అనంతరం క్యాతం వెంకటరమణ మాట్లాడుతూ గోదావరి పవిత్రతను ప్రాశస్త్యాన్ని భావితరాలకు సాటి చెప్పుటకు ఈ మహా హారతి కార్యక్రమం నిర్వహిస్తున్నామన్నారు. సోమవారం నిర్వహించే కార్యక్రమంలో భక్తులందరూ పాల్గొనగలరని విజ్ఞప్తి చేశారు. ఈ కార్యక్రమంలో అధ్యక్షుడు కొత్త శ్రీనివాస్, గోదావరి హారతి ఉత్సవ సమితి మండల కన్వీనర్ బోయిని నారాయణ,కో-కన్వీనర్ నారమల్ల కృష్ణలు పాల్గొన్నారు.

ధర్మపురి ఎమ్మెల్యే అడ్లూరి లక్ష్మణ్ కుమార్‌కు గజమాలతో సన్మానం

నవతెలంగాణ-ధర్మారం

తెలంగాణ అసెంబ్లీ హాల్‌లో ధర్మపురి నియోజకవర్గ శాసనసభ్యుడిగా ప్రమాణ స్వీకారం చేసిన సందర్భంగా అనంతరం తెలంగాణ టూరిజం హోటల్‌లో అడ్లూరి లక్ష్మణ్ కుమార్ ను ధర్మారం కాంగ్రెస్ నాయకులు గజమాలతో సన్మానించారు ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ ప్రముఖ నాయకులు దేవి జనార్దన్, కాడే సూర్యనారాయణ, ఎండీ.బాసిర్ బాయ్, పాలకుర్తి రాజేశం గౌడ్, గాజుల లక్ష్మణ్, పాలకుర్తి సాయి, ఎర్రం సంజీవ్ తదితరులు పాల్గొన్నారు.

చెప్పిన మాట నిలబెట్టుకున్న కాంగ్రెస్

నవతెలంగాణ-రామగిరి

కాంగ్రెస్ పార్టీ ఇచ్చిన మాట నిలబెట్టుకున్నదని కాంగ్రెస్ అని మంథని బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు తొట్ల తిరుపతి యాదవ్ అన్నారు. ఈ మేరకు శనివారం రామగిరి మండల కేంద్రంలోని సెంటినరీ కాలనీ టౌన్ అధ్యక్షుడు కాటం సత్యం ఆధ్వర్యంలో మహాలక్ష్మి స్కీం క్రింద ఉచిత బస్సు ప్రయాణం ప్రారంభం చేశారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అధికారంలోకి రాగానే మహిళలందరికీ ఆర్టీసీ బస్సులో ఉచిత ప్రయాణం కల్పిస్తామన్న మాటను కాంగ్రెస్ పార్టీ నిలబెట్టుకుందని, పదవి చేపట్టిన రెండ్రోజుల్లోనే అమలు చేయటం సంతోషంగా ఉందన్నారు. ఈ కార్యక్రమంలో రామగిరి మండల ఎంపీపీ అరెల్లి దేవక్క-కొమరయ్య, రామయ్య పల్లి సర్పంచ్ దేవునూరి రజిత-శ్రీనివాస్,పెద్దపల్లి జిల్లా కాంగ్రెస్ పార్టీ ఉపాధ్యక్షుడు తోట చంద్రయ్య, బీసీ సెల్ అధ్యక్షుడు బండారి సదానందం పాల్గొన్నారు

నవతెలంగాణ
సమగ్ర తెలుగు దినపత్రిక
ఆదిలాబాద్
ఆదివారం | డిసెంబర్ 10, 2023 | www.navatelangana.com

రాష్ట్ర స్థాయి పోటీలకు ఆదర్శ విద్యార్థుల ఎంపిక

నవతెలంగాణ-ఆసిఫాబాద్

జిల్లా కేంద్రంలోని తెలంగాణ ఆదర్శ పాఠశాలకు చెందిన ముగ్గురు విద్యార్థులు ఎస్‌జీఎఫ్ రాష్ట్ర స్థాయి పోటీలకు ఎంపికైనట్లు ప్రిన్సిపాల్ అబ్దుల్ ఖలీల్ తెలిపారు. పాఠశాల క్రీడా సమాఖ్య ఆధ్వర్యంలో ఈ నెల 7, 8 తేదీలలో నిర్మల్‌లో నిర్వహించిన జోనల్ స్థాయి టెన్నికాయిట్ పోటీల్లో అండర్-14 బాలికల విభాగంలో 8వ తరగతి విద్యార్థినులు వేల్పుల శ్రీవర్షిణి, ఎస్.హరిచందన ఉత్తమ ప్రతిభ కనబరిచి రాష్ట్ర స్థాయి పోటీలకు ఎంపికయ్యారు. బెల్లంపల్లిలో ఈ నెల 6న నిర్వహించిన బేస్ బాల్ అండర్-17 బాలుర విభాగంలో 9వ తరగతి విద్యార్థి కడ్తల సాయి ప్రసాద్ ఉత్తమ ప్రతిభ కనబరిచి రాష్ట్ర స్థాయి పోటీలకు ఎంపికైనట్లు ప్రిన్సిపాల్ తెలిపారు. ఈ సందర్భంగా రాష్ట్ర స్థాయి పోటీలకు ఎంపికైన విద్యార్థులను ప్రిన్సిపాల్, పీడి బి.తిరుపతి, ఉపాధ్యాయులు, యాజమాన్య కమిటీ చైర్మన్ ప్రేమ్, కమిటీ సభ్యులు అభినందించారు.

గోలేటి ఆశ్రమ పాఠశాలలో బాలుడికి గాయం

నవతెలంగాణ - రెబ్బెన

మండలంలోని గోలేటి ఆశ్రమ పాఠశాలలో ఏడో తరగతి చదువుతున్న తిర్యాణి గ్రామానికి చెందిన తొడసం గంగారాంను గణితశాస్త్రం ఉపాధ్యాయురాలు కొట్టడంతో చేతికి గాయమైనట్లు నానమ్మ తెలిపారు. ఈ సంఘటన జరిగి ఐదు రోజులు గడుస్తున్నప్పటికీ ఉపాధ్యాయురాలు కానీ, ప్రధానోపాధ్యాయులు కానీ ఈ విషయాన్ని బయటకు రానివ్వకుండా చూశారు. బాధిత విద్యార్థి గంగారాంకు మోచేతి గాయం ఎక్కువ కావడంతో శనివారం ప్రధానోపాధ్యాయుడు బాలుడి తల్లిదండ్రులకు ఆస్పత్రికి తీసుకెళ్లాలని సమాచారం అందించారు. దీంతో బాలుడి నానమ్మ వచ్చి బాలుడిని తీసుకెళ్లే క్రమంలో విషయం బయటకు వచ్చింది. ఐదు రోజుల క్రితం టీచర్ హోంవర్క్ ఇచ్చిందని, చేయకపోవడంతో ఆగ్రహానికి గురై చేతిలో ఉన్న కర్రతో బలంగా కొట్టడంతో మోచేతి ఎముకకు గాయమైనట్లు విద్యార్థి తెలిపాడు. సిక్ గది నుండి తాను బయటకు రాకపోవడంతో తోటి విద్యార్థులు ఇచ్చిన సమాచారంతో ప్రధానోపాధ్యాయుడు తల్లిదండ్రులకు సమాచారం ఇచ్చారని పేర్కొన్నాడు.

మహిళలకు కాంగ్రెస్ పెద్దపీట



నవతెలంగాణ-ఆదిలాబాద్‌టౌన్

కాంగ్రెస్ పార్టీ ఆరు గ్యారంటీ హామీలలో రెండు గ్యారంటీలను తక్షణమే అమలు చేయడం అభినందనీయమని ఆ పార్టీ ఆదిలాబాద్ అసెంబ్లీ ఇన్‌చార్జి కంది శ్రీనివాస్‌రెడ్డి అన్నారు. ఎన్నికల్లో ఇచ్చిన హామీ మేరకు కాంగ్రెస్ సర్కార్ కొలువుదీరిన వెంటనే సీఎం రేవంత్‌రెడ్డి ఏఐసీసీ అధినేత్రి సోనియగాంధీ పుట్టినరోజు సందర్భంగా మహాలక్ష్మీ పథకం కింద మహిళలకు ఉచిత బస్సు ప్రయాణ సౌకర్యాన్ని లాంచనంగా ప్రారంభించారు. జిల్లాకేంద్రంలో కంది నేతృత్వంలో పార్టీ శ్రేణులు బస్టాండ్ వద్ద టపాసులు కాల్చి సంబరాలు చేసుకున్నారు. జెండా ఊపి బస్సులను శనివారం ప్రారంభించారు. కంది తన సతీమణి సాయిమౌనారెడ్డితో కలిసి బస్సులో ప్రయాణిస్తున్న మహిళలకు శాలువాలతో సత్కరించారు. ఈ హామీ అమలు పట్ల వారి అభిప్రాయాలను అడిగితెలుసుకున్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం మహిళలకు పెద్ద పీటవేస్తూ ఈ నిర్ణయం తీసుకుందని కంది శ్రీనివాస్ రెడ్డి అన్నారు. పేద, మధ్య తరగతి, ఉద్యోగులకు ఈ ఉచిత ప్రయాణ సౌకర్యం ఎంతగానో ఉపకరిస్తుందన్నారు. డబ్బులను ఆదా చేసుకుని వాటిని తమ కుటుంబ సంక్షేమం కోసం ఉపయోగించుకోవచ్చని తెలిపారు. కాంగ్రెస్ ప్రభుత్వంలో ఇక అన్నీ మంచి రోజులేనని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో డీసీసీ వర్కింగ్ ప్రెసిడెంట్ భూపెల్లి శ్రీధర్, డీసీసీబీ డైరెక్టర్ బాలూరి గోవర్ధన్‌రెడ్డి, కిసాన్ సెల్ రాష్ట్ర కార్యదర్శి బోరంచు శ్రీకాంత్‌రెడ్డి, డీసీసీబీ మాజీ చైర్మెన్ ముడుపు దామోదర్‌రెడ్డి, ఎస్టీ సెల్ చైర్మెన్ షెడ్మకి ఆనంద్‌రావు, యువజన కాంగ్రెస్ జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు చరణ్‌గౌడ్, రూపేష్‌రెడ్డి, ఎస్సీ సెల్ చైర్మెన్ చంద్రాల రాహుల్, సీనియర్ నాయకులు గిమ్మ సంతోష్‌రావు, కొండూరి రవి, మైనార్టీ నాయకులు రఫిక్, షకిల్ పాల్గొన్నారు.

సీఎం ఫ్లెక్సీకి పాలాభిషేకం

నవతెలంగాణ-బేల

ప్రగతి భవన్‌కు జ్యోతి భాపూలే పేరును నామకరణం చేయడాన్ని హర్షిస్తు మలీ సంఘం ఆధ్వర్యంలో సీఎం రేవంత్ రెడ్డి ఫ్లెక్సీకి పాలాభిషేకం చేశారు. శనివారం మండలంలోని జూనోని, టాక్లీ గ్రామాల మాలి సంఘం నాయకులు సీఎం నిర్ణయాన్ని స్వాగతిస్తూ ధన్యవాదలు తెలిపారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ గతంలో ఏ ముఖ్యమంత్రి కూడా మాలి సంఘం ఆరధ్య దైవమైన జ్యోతిబా ఫూలేను గుర్తించలేదన్నారు. సామాన్య ప్రజలకు ప్రగతి భవన్‌లో రాకుండా చేశారని, కానీ కాంగ్రెస్ ప్రభుత్వం వచ్చి రాగానే ప్రగతి భవన్ పేరును మహాత్మా జ్యోతిభా ఫూలే ప్రజాభవన్‌గా మార్చారన్నారు. తెలంగాణ సీఎం రేవంత్ రెడ్డికి మాలి సంఘం తరపున ధన్యవాదములు తెలియజేస్తున్నామన్నారు. తమ ప్రధాన డిమాండ్ ఎస్టీ జాబితాలో చేర్చాలని కోరారు. ఈ కార్యక్రమంలో జూనోని, టాక్లీ మాలి సంఘం నాయకులు సురేష్ గుర్నులే, దీపక్ మొహుర్లే, శేష్‌రావ్ ఫుల్కర్, మురళీ, బాబన్న పాల్గొన్నారు.

ఐఎన్‌టీయూసీలో చేరిక

నవతెలంగాణ-తాండూరు

బెల్లంపల్లి ఏరియాలోని ఐఎన్‌టీయూసీలో వివిధ డిపార్ట్మెంట్ల నుంచి భారీగా చేరికలు జరిగినట్లు ఆ సంఘం ఏరియా సీనియర్ నాయకులు పేరం శ్రీనివాస్ తెలిపారు. చేరిన వారిలో హెచ్ఎంఎస్ హాస్పటల్ ఫిట్ సెక్రటరీ వినయ్ కుమార్ గోలేటి సిహెచ్పీ నుంచి హరిబాబు ఎస్ఎన్‌పీసీ డిపార్ట్మెంట్ నుండి సీహెచ్ అనిల్ కుమార్ గొర్ల శ్రీనివాస్ చేరినట్లు వివరించారు. ఈ సందర్భంగా శ్రీనివాస్ మాట్లాడుతూ సింగరేణిలో ఐఏఎన్‌టీయూసీ సెక్రటరీ జనరల్ జనక్ ప్రసాద్ నాయకత్వంలో సింగరేణికి రక్షణగా ఐఎన్‌టీయూసీ మాత్రమే ఉండగలదని తెలిపారు. గతంలో గెలిచినటువంటి ఏఐటీయూసీ టీబీజీకేఎస్ యూనియన్లు విఫలమవడం వలన సింగరేణి పరిస్థితి దిగజారి పోయినదని తెలిపారు. జరగబోయే యూనియన్ ఎన్నికల్లో ఐఎన్‌టీయూసీని గెలిపించినట్లయితే కార్మిక సంక్షేమం కోసం యూనియన్ కృషి చేస్తుందని తెలిపారు. కాంగ్రెస్ అనుబంధ యూనియన్ ఐఎన్‌టీయూసీని గెలిపించాలని కోరారు. ఈ సమావేశంలో టీపీసీసీ మెంబర్ చిలుముల శంకరన్న సీనియర్ ఉపాధ్యక్షుడు సిద్ధంశెట్టి రాజమౌళి, మల్లారం చిన్నరాజం, పేద శ్రీనివాస్, అధ్యక్షతన జరిగినటువంటి సమావేశములో నాయకులు జీపీ చంద్రకుమార్ దుంద్రా రవి, రవికుమార్, సూర్యనారాయణ, కుక్కల ఓదెలు, కనకయ్య, వెంబడి చంద్రశేఖర్ పాల్గొన్నారు.

మహాలక్ష్మితో మహిళలకు ఎంతో మేలు

నవతెలంగాణ-జన్నారం

తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం మహిళలకు ఉచిత బస్సు సౌకర్యం మహాలక్ష్మి పథకంతో మహిళలకు ఎంతో మేలు చేకూరుతుందని కాగ్రెస్ మండల అధ్యక్షుడు ముజాఫర్ అలీ అన్నారు. శనివారం మండల కేంద్రంలోని బస్టాండ్ లో కాంగ్రెస్ నాయకులతో కలిసి బస్సులలో ఉచితంగా ప్రయాణించే మహిళలకు స్వీట్లు తినిపించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ 6 గ్యారంటీ స్కీమ్‌లలో ఒకటైన మహాలక్ష్మి పథకాన్ని ప్రారంభించడం ఆనందంగా ఉందన్నారు. మిగతా అన్ని స్కీములను కూడా ప్రభుత్వం ప్రారంభిస్తుందని ఆశాభావం వ్యక్తం చేశారు. ప్రభుత్వాన్ని ప్రజలు ఆదరించాలని కోరారు.

దుకాణాల ఏర్పాటుకు దరఖాస్తు చేసుకోవాలి

నవతెలంగాణ - రెబ్బెన

ఈ నెల 23న బెల్లంపల్లి ఏరియాలో నిర్వహించనున్న సింగరేణి ఆవిర్భావ దినోత్సవ వేడుకల్లో భాగంగా భీమన్న మైదానంలో జరిగే ఈ వేడుకల్లో వివిధ విభాగాల్లో దుకాణాలు ఏర్పాటు చేసుకొనే వారు దరఖాస్తు చేసుకోవాలని సింగరేణి అధికారులు ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ఈ నెల 23న మాదారం డిస్పెన్సరీలో దీపాలంకరణ, 21న గోలేటి శ్రీభీమన్న మైదానంలో దీపాలంకరణ, హరితగృహాలు, మాదారం, గోలేటి, సింగరేణి క్వార్టర్లు, సాంస్కృతిక కార్యక్రమాలు, పాటలు, నృత్యాలు, మిమిక్రీ, వాయిద్యాలు, వివిధ రకాల స్టాల్స్ ఏర్పాటు చేసుకొనే వారు ఈ నెల 18 వరకు దరఖాస్తు చేసుకోవాలని తెలిపారు. నిర్ణీత గడువులోపు వచ్చిన దరఖాస్తులు మాత్రమే పరిగణలోకి తీసుకోబడుతాయని అధికారులు తెలిపారు.

ఉచిత ప్రయాణం..మహిళల ఆనందం..!

- **ప్రారంభమైన మహాలక్ష్మీ పథకం**



నవతెలంగాణ-ఆదిలాబాద్ టౌన్

రాష్ట్ర ప్రభుత్వం మహిళలకు టీఎస్ ఆర్టీసీ బస్సుల్లో ఉచిత ప్రయాణం చేసే అవకాశాన్ని కల్పించింది. శనివారం మధ్యాహ్నం రెండు గంటల నుండి ఈ సౌకర్యాన్ని కల్పించింది. ప్రభుత్వం ఆరు గ్యారెంటీల అమలులో భాగంగా చేపట్టిన మహాలక్ష్మీ పథకాన్ని జిల్లా కలెక్టర్ రాహుల్‌రాజ్, ఆర్టీసీ ఉన్నతాధికారులు లాంఛనంగా ప్రారంభించారు. ఈ క్రమంలో ఉమ్మడి ఆదిలాబాద్ వ్యాప్తంగా ఆర్టీసీ బస్సులలో మహిళలకు ఉచిత ప్రయాణం కార్యక్రమాన్ని ప్రారంభించారు. దీంతో బస్టాండ్ ప్రాంతంలో తొలి రోజు కాస్త సందడి వాతావరణం కనిపించింది. ఆదిలాబాద్ రీజియన్ పరిధిలో 600బస్సులు ఉండగా ఇందులో పల్లెవెలుగు, ఎక్స్‌ప్రెస్ బస్సులు 487 వరకు ఉన్నాయి. వీటన్నింటిలో మహిళలకు ఉచితంగా ప్రయాణించే వెసులుబాటు కల్పించింది. తొలిరోజు బస్సుల్లో ప్రయాణించిన మహిళలు ఆనందం వ్యక్తం చేశారు. ప్రభుత్వం కల్పించిన ఈ సౌకర్యం పేదలకు ఎంతగానో ఉపయోగపడుతుందని వివరించారు.

బస్సుల సంఖ్యను పెంచాలి..

ఆర్టీసీ బస్‌స్టేషన్లో బాలికలు, మహిళలు.. పల్లెవెలుగు, ఎక్స్‌ప్రెస్ బస్సులో ఉచితంగా ప్రయాణించడానికి ఆసక్తి చూపించారు. ఈ సౌకర్యం కల్పించడం తమకు వరమని చెబుతున్నారు. దూర ప్రాంతాలకు వెళ్లే వారికి మరింత ఉపయోగకరంగా ఉంటుందని హర్షం వ్యక్తం చేశారు. కాగా పల్లెవెలుగు, ఎక్స్ ప్రెస్ బస్సుల్లో ఉచిత ప్రయాణంతో మహిళల రద్దీ పెరుగుతుందని, బస్సుల సంఖ్య కూడా తక్కువగా ఉండడంతో ప్రయాణించడం కష్టంగా మారుతుందని..బస్సుల సంఖ్య పెంచి ఇబ్బందులు కలగకుండా చూడాలని పలువురు మహిళలు కోరుతున్నారు.



ఈ పథకం విద్యార్థినులకు చాలా మేలు

సాయిప్రియ, విద్యార్థిని, ఆదిలాబాద్



కాంగ్రెస్ పార్టీ ఇచ్చిన హామీ మేరకు మహిళలకు ఆర్టీసీ బస్సుల్లో ఉచిత ప్రయాణం సౌకర్యం చాలా బాగుంది. ఇది అమలు చేయడంతో చాలా మంది మహిళలకు ఉపయోగపడుతుంది. ముఖ్యంగా దూర ప్రాంతాల నుండి చదువుల కోసం పాఠశాలలకు, కళాశాలకు రాకపోకలు సాగించే విద్యార్థినులకు చాలా మేలు జరుగుతుంది. మహిళల కోసం ఈ పథకం చేపట్టడంతో సీఎం రేవంత్‌రెడ్డి ప్రత్యేక ధన్యవాదాలు తెలుపుతున్నాను.

నూతన ప్రభుత్వానికి ధన్యవాదాలు

సవిత, ఆదిలాబాద్



నేను ఆదిలాబాద్ జిల్లా కేంద్రంలో నివాసిస్తుంటాను. రవాణా సౌకర్యం కోసం ఆర్టీసీ బస్సును ఉపయోగించుకుంటాను. కొత్త ప్రభుత్వం మహిళలకు ఉచితంగా బస్సులో ప్రయాణించే సౌకర్యం కల్పించడం చాలా సంతోషంగా ఉంది. టికెట్ ధరలు కూడా చాలా ఉన్నాయి. రాకపోకలు కోసం చాలా ఖర్చు అవుతుంది. ప్రభుత్వం ఈ పథకం అమలు చేయడంతో మహిళలకు మేలు జరుగుతుంది. కొత్త ప్రభుత్వానికి ధన్యవాదాలు.

పేద కుటుంబీకులకు ఎంతో మేలు

అనిత, గుడిహత్నూర్



ప్రభుత్వం మహిళల కోసం గొప్ప పథకం తీసుకొచ్చింది. ఈ పథకం పేద, మధ్యతరగతి కుటుంబాల వారికి ఎంతగానో దోహదపడుతుంది. ఉచిత ప్రయాణం ద్వారా చాలా వరకు డబ్బు ఆదా అవుతుంది. ఆ డబ్బును ఇతర పనులకు ఉపయోగించుకోవడానికి సులువుగా ఉంటుంది. దూర ప్రాంతాలకు సైతం ఉచిత ప్రయాణం సౌకర్యం కల్పించడంతో చాలా మేలు జరుగుతుంది. ఈ పథకాన్ని ఇలాగే కొనసాగించాలి.

ఘనంగా సోనియాగాంధీ జన్మదినోత్సవం



ఆదిలాబాద్‌లో కేక్‌కట్ చేస్తున్న మాజీ టీపీసీసీ ప్రధాన కార్యదర్శి గండ్రత్ సుజాత పక్కన నాయకులు

నవతెలంగాణ-ఆదిలాబాద్‌టౌన్

ఎన్నికల్లో ఓడినా, గెలిచినా తాను ప్రజల మనిషినేనని కాంగ్రెస్ పార్టీ ఆదిలాబాద్ అసెంబ్లీ ఇన్‌చార్జి కంది శ్రీనివాస్‌రెడ్డి అన్నారు. అవినీతిలో కూరుకుపోయిన బీఆర్ఎస్ పాలనకు చరమగీతం పాడామని, ప్రజల మద్దతుతో తెలంగాణలో కాంగ్రెస్ ప్రభుత్వాన్ని ఏర్పాటు చేసుకున్నామని తెలిపారు. ఏఐసీసీ అధినేత్రి సోనియాగాంధీ జన్మదినోత్సవం సందర్భంగా పట్టణంలో పార్టీ శ్రేణులతో కలిసిపెద్ద ఎత్తున ర్యాలీ నిర్వహించారు. మావల బైపాస్ వద్ద ప్రారంభమైన ర్యాలీ పట్టణంలోని ప్రధాన కూడళ్ల మీదుగా సాగి అంబేద్కర్ చౌక్ చేరుకుంది. అంబేద్కర్ విగ్రహానికి నివాళ్లులర్పించిన అనంతరం సోనియాగాంధీ జన్మదినం సందర్భంగా 77 కిలోల భారీ కేక్‌ను కట్ చేసి సంబరాలు జరుపుకున్నారు. దశాబ్దం కిందట డిసెంబర్ 9న తెలంగాణ ప్రజల కలను సోనియాగాంధీ తెలంగాణ కల సాకారం చేసిన రోజని కంది శ్రీనివాస్ రెడ్డి గుర్తు చేశారు. తెలంగాణ తల్లి ఎలా ఉంటుందో ఎవరికి తెలియదని, కానీ తెలంగాణ ఇచ్చిన తల్లి సోనియమ్మను చూస్తున్నామన్నారు. ఆమె జన్మదినం రోజున తెలంగాణను ఆమెకు బహుమతిగా ఇస్తున్నామన్నారు. ఆదిలాబాద్‌లో కాంగ్రెస్ ఓటమికి ఆ నలుగురే కారణమని ఆరోపించారు. పైసలకు అమ్ముడుపోయి పార్టీని ఓడించారని మండిపడ్డారు. కాంగ్రెస్ లీడర్లుగా చెలామణి అయినపుడు రూ.20 కోట్లు ఇవ్వమని అడిగారని, డబ్బులివ్వకపోవటంతో తల్లిలాంటి కాంగ్రెస్‌కు ద్రోహం చేశారని తీవ్రస్థాయిలో ధ్వజమెత్తారు. ఎవడో గులాబీ పార్టోడు రేవంత్ రెడ్డి సీఎం అయితే ఉరేసుకుంటానని అన్నాడని, కానీ ఆ అవసరంలేదని ఎద్దేవా చేశారు. ప్రాణబిక్ష పెడుతున్నాం, బతికిపో అంటూ వ్యాఖ్యనించారు. ఇకపై వచ్చే ప్రతీ ఎన్నికల్లో ఎగిరేది కాంగ్రెస్ జెండానేనని ధీమా వ్యక్తం చేశారు. ఆదిలాబాద్ అభివృద్ధి కోసం ప్రశ్నించే గొంతుకగా ఉంటానన్నారు. ఈ కార్యక్రమంలో డీసీసీ వర్కింగ్ ప్రెసిడెంట్ భూపెల్లి శ్రీధర్, డీసీసీబీ డైరెక్టర్ బాలూరి గోవర్ధన్‌రెడ్డి, కిసాన్ సెల్ రాష్ట్ర కార్యదర్శి బోరంచు శ్రీకాంత్‌రెడ్డి, డీసీసీబీ మాజీ చైర్మెన్ ముడుపు దామోదర్‌రెడ్డి, ఎస్టీ సెల్ చైర్మెన్ షెడ్మకి ఆనంద్‌రావు, యువజన కాంగ్రెస్ జిల్లా అధ్యక్షులు చరణ్‌గౌడ్, ప్రధాన కార్యదర్శి రూపేష్‌రెడ్డి, ఎస్సీ సెల్ చైర్మెన్ చంద్రాల రాహుల్, సీనియర్ నాయకులు గిమ్మ సంతోష్‌రావు, కొండూరి రవి, మైనార్టీ నాయకులు రఫిక్, షకిల్ పాల్గొన్నారు.

ప్రజల ఆకాంక్ష నేరవేర్చింది సోనియా గాంధీ..

ప్రజల ఆకాంక్ష నేరవేర్చింది కాంగ్రెస్ అధినేత్రి సోనియా గాంధీ అని మాజీ టీపీసీసీ ప్రధాన కార్యదర్శి గండ్రత్ సుజాత అన్నారు. శనివారం సోనియా గాంధీ జన్మదిన వేడుకలను మాజీ మంత్రి దివంగతనేత సీఆర్ఆర్ నివాసం వద్ద నిర్వహించారు. ముందుగా కేక్ కట్ చేసి ఒకరికొకరు తినిపించుకున్నారు. అనంతరం టపాసులు పేల్చి సోనియా గాంధీకి జన్మదిన శుభాకంక్షలు తెలిపారు. 60 ఏళ్ల తెలంగాణ ప్రజల ఆకాంక్షను నేరవేర్చిన ఘనత సోనియా గాంధీదని గుర్తు చేశారు. తెలంగాణ ఇచ్చిన సోనియా ప్రజల గుండెల్లో నిలిచిపోతారన్నారు. బ్రిటిష్ వారిపై ఉద్యమించి స్వాతంత్ర్యం సాధించిన సమరయోధులను ఎలా గుర్తించుకుంటున్నామో తెలంగాణ ఇచ్చిన సోనియాను కూడా అలానే గుర్తించుకుంటారని తెలిపారు. ఈ కార్యక్రమంలో స్వతంత్ర్య ఎమ్మెల్యే అభ్యర్థి సంజీవ్ రెడ్డి, కౌన్సిలర్ అంబకంటి అశోక్, ప్రభాకర్, నహీద్, ఫెరోజ్, రాంరెడ్డి నాయకులు ఉన్నారు.

తలమడుగు : కాంగ్రెస్ అధినేత్రి సోనియాగాంధీ 77వ జన్మదిన వేడుకలను పార్టీ ఆధ్వర్యంలో శనివారం లింగి గ్రామ సాయి వృద్ధాశ్రమంలో జన్మదిన వేడుకలను ఘనంగా నిర్వహించారు. జెడ్పీటీసీ గోక గణేష్ వృద్దులతో కేక్‌కట్ చేసి పండ్లను పంపిణీ చేశారు. అనంతరం ఆశ్రమానికి రూ. 5వేల నగదు ఆర్థిక సాయం అందించారు. ఈ కార్యక్రమంలో పార్టీ కన్వీనర్ కళ్యాణం రాజేశ్వర్, గంగారాం, ఎంపీటీసీలు రమేష్ రెడ్డి, వెంకన్న యాదవ్, కమలాకర్, ఎస్సీ సెల్ అధ్యక్షులు అశోక్, మైనార్టీ సెల్ అధ్యక్షులు రఫీక్, పీఏసీఎస్ డైరెక్టర్ శ్రీనివాస్ రెడ్డి, యూత్ కాంగ్రెస్ అధ్యక్షులు గణేష్, పోతన్న, విలాస్ యాదవ్, లోక ప్రవీణ్ రెడ్డి, గాజుల సాంబశివ్, బాలాజీ, దివాకర్, వెంకటేష్, గంగారెడ్డి, కమలాకర్, సుదర్శన్ రెడ్డి పాల్గొన్నారు.

తాంసి: తెలంగాణ రాష్ట్రాన్ని ఇచ్చిన సోనియా గాంధీ జన్మదినాన్ని శనివారం మండల కేంద్రంతో పాటు మండలంలోని కప్పర్ల, వడ్డడి, బండల్ నాగపూర్ గ్రామాలతో పాటు పలు గ్రామాల్లో పార్టీ శ్రేణులు ఘనంగా నిర్వహించారు. మండల కేంద్రంలోని కస్తూర్బా గాంధీ బాలికల వసతి గృహంలో విద్యార్థుల నడుమ కేక్‌కట్ చేసి విద్యార్థినులకు పెన్నులను పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో నాయకులు రామన్న యాదవ్, వెంకట్ రెడ్డి, రాకేష్ యాదవ్, సంతోష్, నారాయణ, గంగారెడ్డి పాల్గొన్నారు.



తాంసిలో కేజీబీవీలో విద్యార్థులకు పెన్నులను పంపిణీ చేస్తున్న కాంగ్రెస్ శ్రేణులు



తలమడుగు సాయిలింగిలో వృద్ధులతో కలిసి సోనియా జన్మదిన వేడుకలు జరుపుకుంటున్న జెడ్పీటీసీ గణేష్‌రెడ్డి

ఘనంగా అంతర్జాతీయ దివ్యాంగుల దినోత్సవం

నవతెలంగాణ-ఆదిలాబాద్‌టౌన్

అంతర్జాతీయ దివ్యాంగుల దినోత్సవ వేడుకలను ఎన్‌పీఆర్‌డీ ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. శనివారం జిల్లా కేంద్రంలోని సుందరయ్య భవన్‌లో ఈ వేడుకలకు ఎన్‌పీఆర్‌డీ జిల్లా ఇన్‌చార్జి బండి దత్తాత్రి పాల్గొని కేక్‌కట్ చేసి శుభాకాంక్షలు తెలిపారు. అనంతరం ఆయన మాట్లాడుతూ దివ్యాంగులకు ప్రభుత్వాలు అన్ని రకాల సౌకర్యాలు కల్పించాలన్నారు. కుటుంబంపై ఆధారపడకుండా స్వతగా జీవనం గడిపేందుకు చొరవ చూపాలన్నారు. దివ్యాంగులను ఆదుకుంటే భవిష్యత్‌లో సానుభూతి కలుగుతుందన్నారు. కుటుంబంలో ఉద్యోగం లేని వారికి ఉద్యోగం కల్పించాలని అన్నారు. అలాగే వ్యాపారం కోసం రుణాలు అందించాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో ఎన్‌పీఆర్‌డీ అధ్యక్ష, కార్యదర్శులు నారాయణ, ఆరిఫా, నాయకులు కిష్టన్న, మంజుల, సుజాత ఉన్నారు.



పోడు పట్టాలకు బ్యాంకు రుణాలు ఇవ్వాలి

- **టీఏజీఎస్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పూసం సచిన్**

నవతెలంగాణ-ఆదిలాబాద్‌టౌన్

పోడు పట్టాలకు బ్యాంకు రుణాలు ఇవ్వాలని, బ్యాంకు అధికారులు ఆదివాసులను ఇబ్బంది గురి చేయకుండా రుణాలు మంజూరు చేయాలని తెలంగాణ ఆదివాసీ గిరిజన సంఘం(టీఏజీఎస్) రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పూసం సచిన్ డిమాండ్ చేశారు. శనివారం జిల్లా కేంద్రంలోని సుందరయ్య భవనంలో టీఏజీఎస్ జిల్లా కమిటీ సమావేశానికి ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. గత ప్రభుత్వం హడావుడిగా పట్టాల పంపిణి చేపట్టి పూర్తి స్థాయిలో పట్టాలు జారీ చేయలేదన్నారు. సర్వే చేసిన అనేక గ్రామాలల్లో పట్టాలు పంపిణి కాలేదని, పూర్తి స్థాయిలో పట్టాలు పంపిణి చేసి వాటికీ బ్యాంకు రుణాలు అందించాలని డిమాండ్ చేశారు. ఫారెస్ట్ అనుమతులు లేక అనేక గ్రామాల్లో రోడ్డు పనులు, మౌళిక సదుపాయల కల్పన ఆపిన వాటిని వెంటనే పూర్తి చేయాలనీ, గిరిజన విద్యా, వైద్యంపై నూతన ప్రభుత్వం ప్రత్యేక శ్రద్ధ పెట్టాలని కోరారు. వెనుక బడిన ఆదిలాబాద్ జిల్లాలో జనరల్ యూనివర్సిటీ ఉట్నూర్ కేంద్రంగా ఏర్పాటు చేసి గిరిజనులకు ఉన్నత విద్యా సౌకర్యాలు కల్పించాలని కోరారు. ఏజెన్సీ చట్టాలను అమలు చేయాలని, నూతన ప్రభుత్వం ఇచ్చిన ఆరు గ్యారెంటీలను గిరిజన ప్రాంతాల్లో పూర్తి స్థాయిలో అమలు చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో సంఘం జిల్లా అధ్యక్షులు ఉయిక విష్ణు, ఉపాధ్యక్షులు మడవి నాగోరావ్, కనక మలుకు, ఆత్రం కిష్టన్న, సహాయ కార్యదర్శి కోవ సునీల్, తుమ్రం ఈశ్వర్, మేస్రం మహేష్ పాల్గొన్నారు.

